నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
ఆదివారం | 16 జూన్ 2024 | www.navatelangana.com

అప్పుల బాధతో ఉరివేసుకుని యువరైతు ఆత్మహత్య



నవ తెలంగాణ-మిరుదొడ్డి

అప్పులు ఎక్కువై తెచ్చిన అప్పులు తీర్చక క్షణికావేశంతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం పెద్ద చెప్పాల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెప్పాలా గ్రామానికి చెందిన గజ్జల బాలరాజు (40) వ్యవసాయం, కూలి పని చేస్తూ వారి కుటుంబాన్ని పోషిస్తూ ఉన్నాడు. మృతుడికి రెండు ఎకరాల భూమి ఉంది వాటిలో వరి పంట వేశారు. వ్యవసాయం. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. కొన్ని రోజులు అప్పులు తీర్చడానికి కోళ్లఫామ్లో పనిచేస్తూ కాస్త అప్పును తీర్చుకున్నారు. ఇంటి వద్దనే బోరు వేసి వ్యవసాయం చేస్తూ జీవన కొనసాగిస్తున్నారు. అప్పుల బాధ భరించలేక బాలరాజు శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు కూతుర్లు,ఒక కుమారుడు ఉన్నాడు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మిరుదొడ్డి ఎస్ఐ పరశురామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షణికావేశంలో ఉరేసుకొని రైతు ఆత్మహత్య

నవ తెలంగాణ-దుబ్బాక

మతిస్థిమితం సరిగా లేక తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడి క్షణికావేశంలో ఓ వృద్ధ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన గరిగే నారాయణ (85) తనకున్న ఏడెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడు. గత కొద్ది రోజులుగా నారాయణకు అనారోగ్యంచే మతిస్థిమితం సరిగా లేదు. చీటికి మాటికి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ధాన్యాన్ని తూకం చల్లే విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడి క్షణికావేశంలో దగ్గర్లోని చెట్టుకు చీరతో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య గంగవ్వ తన కుమారుడికి కేకలిస్తూ చెప్పింది. వెంటనే కుటుంబ సభ్యులు నారాయణను కిందికి దించి ఊర్లోని ఆర్ఎంపీ డాక్టర్ దుద్దెడ రాజు వద్దకు తీసుకెళ్లగా అప్పటికే చనిపోయాడని చెప్పాడు. మృతుడి కుమారుడు బిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గొర్రెల స్కాం... పైళ్లు మాయం



- కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు కూడా
- సెలవుల్లో జిల్లా అధికారి
- నగదు రూపంలో అవినీతి జరిగినట్లు పిర్యాదులు
- ఈడీ విచారణలో లోగుట్టు తేలేనా
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమాలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి లోగుట్టు రట్టవుతోంది. గొర్రెల పథకం పెద్ద స్కాం అంటూ అనేక పిర్యాదులొచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక గొర్రెల పంపిణీ పేర జరిగిన అవినీతి, అక్రమాల పుట్టను తవ్వుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో కూడా గొర్రెల పంపిణీ పథకం పేరిట నగదు బదిలీకి పాల్పడడం, ఒకరికి గొర్రెలిచ్చినట్లు పోటోలు దింపి అవే గొర్రెల్ని మరొకరికి ఇచ్చారు. కాగితాల్లో గొర్రెల్ని పంపిణీ చేసినట్లు చూపి నగదు రూపంలో డబ్బులు నొక్కేసిన వైనం వెలుగు చూసే సరికి పశు సంవర్ధక శాఖలో పైళ్లు, కంప్యూటర్ హర్డ్‌డిస్క్‌లు మాయమయ్యాయి. ఏకంగా జిల్లా అధికారులు సెలవుపై వెళ్లిపోవడం కొసమెరుపు.

ఈడీ రంగంలోకి... పైళ్లు మాయం

గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగడంతో అన్ని జిల్లాల్లో అలజడి మొదలైంది. అంతరాష్ట్రాలతో ఈ పథకంలో లింకు ఉన్నందున పథకం అమలుకు సంబంధించిన అనేక వివరాలు ఇవ్వాల్సిందిగా ఈడీ అధికారులు కోరారు. జిల్లాల వారిగా లబ్దిదారుల వివరాలు, కాంట్రాక్టు నెంబర్లు, అడ్రస్సు, లావాదేవీలు నడిపిన బ్యాంకు పేరు, బ్రాంచీలు, గొర్రెలు అమ్మిన వారి వివరాలు, దానా కొనుగోళ్లు, పంపిణీ చేసిన లబ్ధిధారులు, వాటా ధనం చెల్లించిన బ్యాంకు ఖాతాల వివరాల ఇవ్వాల్సిందిగా కోరడంతో రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో కలవరం మొదలైంది. గొర్రెల పంపిణీ చేసిన వివరాల్ని ఈడీకి అందజేస్తే అందులో జరిగిన అక్రమాల చిట్ట వెలుగు చూసే అవకాశముంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయనే పిర్యాదులున్నాయి. రాష్ట్ర స్థాయి అధికారుల్ని ఈడీ కోరిన వివరాల్ని ఇవ్వాల్సి వస్తే జిల్లా అధికారులు సైతం తమ కార్యాలయంలో ఉన్న పైళ్లు, కంప్యూటర్ హర్డ్‌డిస్క్‌ల్ని కూడా ఇవ్వాల్సి వస్తది. అదే జరిగితే అక్రమాల తంతు వెలుగు చూసే అవకాశముందని గమనించిన పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారులు, సెక్షన్ సిబ్బంది తమ కార్యాలయంలోని పైళ్లను మాయం చేసినట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సెలవుల్లో వెళ్లిపోవడంతో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయనే పిర్యాదులున్నాయి. ఆ జిల్లాల్లోనూ పైళ్ల తారుమారు అయాయనే ప్రచారం సాగుతుంది. కంప్యూటర్ ఆపరేటర్లు సిస్టమ్స్‌లోని డేటాను కూడా డిలిట్ చేసి హర్డ్ డిస్క్‌ల్ని మాయం చేసినట్లు ప్రచారం సాగుతోంది.

మూడు జిల్లాల్లో గొర్రెల పంపిణీ

ఉమ్మడి మెదక్ జిల్లాలో సబ్సిడీ గొర్రెల పంపిణీలో స్కాం జరిగినట్లు వార్తలొస్తున్నాయి. గత ప్రభుత్వం 2017లో పథకాన్ని రూ.125000తో ప్రారంభించింది. గొర్రెలపెంపకందార్ల సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న వాళ్లు 25 శాతం వాటా ధనం చెల్లిస్తే ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇచ్చింది. రెండో దశలో యూనిట్ విలువను రూ.175000 చేసింది. 21 గొర్రెల్ని పక్క రాష్ట్రాలు తమిళనాడు, ఏపీ నుంచి తెచ్చి పంపిణీ చేశారు. గొర్రెలకు ఇన్సూరెన్స్, రవాణా ఖర్చులు, దానా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరించింది. సంగారెడ్డి జిల్లాలో 522 సొసైటీలుండగా వీటిల్లో 31170 మంది సభ్యులున్నారు. మొదటి విడతలో 19203 మందికి గొర్రెల్ని పంపిణీ చేశారు. రెండో విడతలో 11967 మందికి గొర్రెల కోసం డీడీలు చెల్లించారు. మెదక్ జిల్లాలో మొదటి విడతలో 12998 మందికి సబ్సిడీ గొర్రెల్ని పంపిణీ చేశారు. రెండో విడతలోనూ 7184 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. సిద్దిపేట జిల్లాల్లోనూ 32 వేల మంది పెంపకందార్లు ఉండగా 17 వేల మందికి పంపిణీ చేశారు.

గొర్రెల పంపిణీలో అక్రమాలు

గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయి. ఎంపిక చేసిన లబ్ధిదారుల కోసం గొర్రెల్ని పక్క రాష్ట్రాలకు వెళ్లి గొనుగోలు చేసి తెచ్చి లబ్దిదారులకు ఇచ్చారు. అవే గొర్రెల్ని తిరిగి తీసుకెళ్లి గొర్రెలు అమ్మిన వాళ్లకు అప్పజెప్పారు. తిరిగి అవే గొర్రెల్ని మరో జిల్లాకు విక్రయించినట్లు చూపారు. ఇలా గొర్రెల్ని సిప్టింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. మధ్య వర్తులు రంగంలోకి దిగి గొర్రెల విక్రయదారులకు కొంత డబ్బు ముట్టజెప్పారు. ఇక్కడ లబ్దిదారులకు కూడా కొంత నగదు ఇచ్చి గొర్రెలు ఇచ్చినట్లుగా రికార్డుల్లో పేర్కొన్నారు. దాన కొనకపోయినా కొన్నట్లు బిల్లులు సృషించారు. వాహనాల్ని వేర్వేరు యజమానులతో మాట్లాడి వాళ్లకు కిరాయిలు చెల్లించినట్లు చూపారు. ఇన్సురెన్స్ కంపెనీలకు కూడా ఇవే దొంగ లెక్కల ప్రచారం బీమా ప్రీమియం చెల్లించి కాజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కడ కూడా లబ్ధిదారులకిచ్చిన సబ్సిడీ గొర్రెలు కనిపించట్లేదు. అవి ఎప్పుడే మాయమయ్యాయి. చెల్లించిన వాటాధనంతో పాటు అదనంగా కొంత తీసుకుని లబ్దిదారులు సైతం సొసైటీ పెద్దలు, అప్పటి ప్రభుత్వంలోని నాయకులు చెప్పినట్లు చేశారు.

సమగ్ర విచారణ జరపాలి

- అతిమెల మాణిక్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు

గొర్రెల స్కాంపై సమగ్ర విచారణ జరపాలి. అక్రమాల్ని వెలుగుతీయాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అవినీతిపాలైన సొమ్మును రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అదే విధంగా వృత్తిదారులకు పథకాన్ని అవినీతికి తావులేకుండా అమలు చేయాలి. గొర్రెలు కాకుండా నగదు రూపంలో సాయం అందించాలి.

కన్న తల్లే హంతకురాలు

గుర్తుతెలియని బాలుడి హత్య కేసులో అసలు విషయం వెలుగులోకి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గుర్తుతెలియని బాలుడి దారుణ హత్యకేసులో కన్న తల్లే అంతకురాలు అని తేలింది. తన వివాహేతర సంబం ధానికి అడ్డువస్తున్నాడని దారుణంగా హత్య చేసి ముళ్ల పదల్లో పడే సినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. దాం తో అంతకు లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చారు. కేసుకు సంబం ధించిన వివరాలను పోలీసులు శనివారం వెల్లడించారు.

పటాన్‌చెరు పోలీసుస్టేషన్ పరిధిలోని ముత్తంగి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ నుంచి కర్దనూర్ గ్రామానికి పోవు సర్వీస్ రోడ్ రాంకీ కన్‌స్ట్రక్షన్ పక్కన, క్యాండీ డస్ ఇంటర్ నేషనల్ స్కూల్ దగ్గరలో ఈనెల 11న ఓ గుర్తు తెలియని బాలుని శవం చెట్ల పొదల్లో పడి ఉన్నదని.. ముత్తంగి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశాడు. దాంతో పటాన్‌చేరు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేసి డీఎస్పీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని బాలుని ఆచూకీ గురించి పత్రిక ప్రకటన, సోషల్ మీడియాలో అన్నీ వాట్సప్ గ్రూప్‌లలో షేరింగ్ చేశారు. దాంతో ఈనెల 13న ఆబాలుని ఆచూకీ తెలిసింది. చనిపో యిన బాలుడు కర్రే విష్ణువర్ధన్ అని.. పాత రావ ంచంద్ర పురం నివాసి అని పోలీసులు గుర్తించారు. దాంతో బాలుడి ఇంటికి పోలీసులు వెళ్లగా.. తాళం వేసి ఉన్నది. దాంతో అనుమానం కలిగి విచారణ జరపగా తల్లే హంతకురాలుగా తేలింది. ఈనెల 10న తానే గొంతు నులిమి హత్య చేశానని నిందితురాలు విచారణలో ఒప్పుకున్నది. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో బాలుడి శవాన్ని ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ ప్రక్కన చెట్ల పొదల్లో పడేసినట్టు వారిద్దరూ అంగీకరించారు. దాంతో నిందితులు కర్రే స్వాతి, ఆమె రెండో భర్త అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో నిందితులను పట్టుకున్న పటాన్‌చేరు సీఐ ప్రవీణ్ ఒడ్డి, బి.రాజు క్రైమ్ సీఐ మరియు క్రైమ్ పార్టీ, మరియు ఇతర సహకరించిన సిబ్బందిని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి అభినదించారు.

తల్లిదండ్రులను హత్య చేసిన కసాయి కొడుకు అరెస్టు

- డబ్బుల కోసమే తల్లిదండ్రుల హత్య
- తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి
- హత్య కేసును చేదించిన పోలీసులు



నవ తెలంగాణ-నర్సాపూర్

జల్సాలకు అలవాటు పడి డబ్బుల కోసం కన్న తల్లిదండ్రులను కడతేర్చిన కసాయి కొడుకును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని తూప్రాన్ డీఎస్పి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నర్సాపూర్ పోలీస్ స్టేషన్ లో నిందితుడిని చూపుతో విలేకరుల ముందు హత్యకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పి వెంకట్ రెడ్డి వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం సాదుల్ నగర్ గ్రామానికి చెందిన నరసమ్మ (70), కిష్టయ్య (74) దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా ఓ కుమారుడు మరణించాడు. అయితే గత కొద్ది రోజుల కిందట సాదుల్ నగర్ గ్రామంలో వారి పొలం అమ్మగా వచ్చిన డబ్బులను ఇద్దరు కుమారులతోపాటు కోడలుకు ఒక్కొక్కరికి నాలుగు లక్షల చొప్పున పంచించ్చారు. అయితే చిన్న కుమారుడు లక్ష్మణ్ వచ్చిన డబ్బులతో ఫైనాన్స్‌లో కారు కొనుగోలు చేసి జల్సాలకు అలవాటుపడ్డాడన్నారు. డబ్బుల కోసం పలుమార్లు తల్లిదండ్రులను అడగగా అతనికి తల్లిదండ్రులు డబ్బులు ఇస్తూ వస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన కొడుకు లక్ష్మణ్ మళ్ళీ తల్లిదండ్రులను డబ్బులు అడగడంతో తమ వద్ద లేవని తేల్చి చెప్పారు. తల్లిదండ్రులను ఎలాగైనా చంపాలని కొడుకు లక్ష్మణ్ పథకం వేశాడు అందులో భాగంగానే గత నెల 17వ తేదీన లక్ష్మణ్ తన సొంత గ్రామమైన సాధు నగర్ గ్రామానికి వచ్చి తల్లిదండ్రులను కారులో తీసుకొని లక్ష్మణ్ నివాసముంటున్న బొంతపల్లి గ్రామానికి తీసుకువెళ్లాడు. మరుసటి రోజు 18వ తేదీన తల్లిదండ్రులను చంపాలని పథకం వేశాడు. చంపేందుకు అనుకున్న సమయం దొరకలేదు. 19వ తేదీన మళ్లీ తల్లిదండ్రులను డబ్బులు అడిగాడు. దీంతో ఇరువురు మధ్య గొడవలు జరిగాయి. ఇదే అదునుగా భావించిన కొడుకు నిద్రిస్తున్న తల్లిదండ్రులను గొంతు నులిమి చంపి వేశాడు. అదే రాత్రి తన కారులో తల్లిదండ్రుల మృతదేహాలను తీసుకువచ్చి నర్సాపూర్ రాయారావు చెరువు కట్ట వెనకాల గల పొదల్లో పడవేసి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో తల్లిదండ్రుల మృతదేహాలను ఎవరు గుర్తుపట్టకుండా తగలబెట్టాడు. తల్లి మెడలో ఉన్న బంగారు నగలను తీసుకున్నాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. వివిధ మధ్యమాల్లో ప్రచారం చేయడంతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌లకు సమాచారం అందించారు. అయితే శనివారం సాదుల్ నగర్ గ్రామస్తుల సమాచారం మేరకు తమ పోలీసులు రంగంలోకి దిగి నిందితుడు లక్ష్మన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా తన తల్లిదండ్రులను డబ్బుల కోసమే హత్య చేసినట్లు తమ విచారణలో ఒప్పుకున్నాడన్నారు. నిందితు డు లక్ష్మన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డి.ఎస్.పి వెల్లడించారు. సిఐ జాన్ రెడ్డి, ఎస్సై పుష్పరాజ్, సిబ్బంది ఉపేందర్, పోచయ్య, శ్రీకాంత్ అన్నారు.

పెప్సీ కంపెనీలో సీఐటీయూ ఘన విజయం పట్ల హర్షం



నవతెలంగాణ- గజ్వేల్

సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలోని పెప్సీ పరిశ్రమలో సీఐటీయూ ఘనవిజయం పట్ల సీఐటీయూ సిద్దిపేట జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. సిద్దిపేట జిల్లా కమిటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి హర్షం వ్యక్తం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పెప్సీ పరిశ్రమ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు గుర్తింపు ఎన్నికల్లో పోటీ చేశారన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్‌కు 70 ఓట్లు పడగా సీఐటీయూకు129 ఓట్లు వచ్చాయన్నారు. హెచ్ఎంఎస్‌పై సీ ఐ టీ యూ 59 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిందన్నారు. సీఐటీయూ కార్మిక సంఘం కార్మిక పక్షపాతి అని కార్మిక సమస్యలపై నిరంతరం పోరాట నిర్వహిస్తుందన్నారు. ఓట్లు వేసి గెలిపించిన కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా దోపిడీని అరికట్టాలి

- అడ్మిషన్ల పేరుతో వ్యాపారాలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిజయరాజు
- డిఆర్వోకి వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

నూతన విద్యా సంవత్సరం మొదలుకాక ముందే ప్రయి వేటు స్కూల్స్, కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల పేరుతో విద్య వ్యాపారాన్ని ప్రారంభించేశాయని, కొన్ని కార్పొరేట్ స్కూల్స్‌లో ఎల్కేజీలో పిల్లలను జాయిన్ చేయాలంటే రూ. లక్ష వరకు చెల్లించాల్సినా పరిస్థితి ఏర్పడిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యా దోపిడీని అరికట్టాలని కోరుతూ సంగారెడ్డి డిఆర్‌ఓకి సీపీఐ(ఎం) బృందం బృందం శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజు మాట్లాడు తూ.. ప్రతీయేడు కార్పోరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నా యన్నారు. మెరుగైన ఉచిత విద్య వైద్యం ప్రతి కుటుంబానికి ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అనేక మంది పేద కుటుంబాల తల్లి తండ్రులు తమ పిల్లల విద్య కోసం తాహతుకు మించి ఖర్చు చేస్తూ అప్పులు పాలవుతున్నారన్నారు. ఫీజుల దోపిడీపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇదో వ్యాపారంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా ప్రమాణాలతో అద్భుతంగా పనిచేసేలా ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం కార్పోరేట్ విద్యా సంస్థలలో ప్రోత్సహించే విధంగా చర్యలకు పాల్పడడం దుర్మార్గ మన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్ లో పేదలకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుక్స్ స్టేషనరీ యూనిఫామ్ షుఉలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవు, బాలికలకు టాయిలెట్లు లేవు, ఉన్నా నీటి వసతి లేదు, వాటిని రోజు శుభ్రం చేసేవారు సరిపడ లేరన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతి పాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ. మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, నాయకులు అశోక్, కృష్ణ, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల దోపిడీని అడ్డుకునేందుకు పోరాటాలు చేస్తే తప్పా

సీపీ ఇచ్చిన ప్రకటనను పునరాలోచించాలి
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్



నవ తెలంగాణ-సిద్దిపేట

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టడం కోసం విద్యార్థి సంఘాలు పోరాటం చేయడం తప్పా అని, సిపి అనురాధ విద్యా సంఘాలు స్కూల్ల ముందు ఆందోళన, ధర్నాలు చేయొద్దని చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యా సంస్థలలో అనేక దోపిడీ జరుగుతున్నా, విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని, విద్యా సంస్థలు విద్యార్థులను ఫీజుల పేరిట ముక్కుపిండి వసూలు చేస్తుంటే, టీసీలు ఇవ్వకుండా విద్యార్థులు ఇబ్బందులు పడ్డప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఉంటే విద్యార్థి సంఘాలు ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన అవసరం ఎందుకు ఉటుందన్నారు. విద్యాసంస్థలు పుస్తకాల వ్యాపారం చేస్తున్నా, పుస్తకాల పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థి సంఘాలు విద్యార్థుల కోసం, పేద కుటుంబాల కోసం పాఠశాలల ముందు ధర్నాలు చేస్తున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారులు పనచేయాల్సిన పనులను విద్యార్థి సంఘాలు చేస్తున్నాయన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వలె కాంగ్రెస్ ప్రభుత్వం వాక్ స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాచారం శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు గొర్రె మధు, అభి తదితరులు పాల్గొన్నారు.

బంగారం పేరుతో భారీ మోసం

3 కిలోల నకిలీ బంగారం అమ్మిన మోసాగల్లు
చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-వర్గల్



తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ.. కట్టు కథలు చెప్తూ అమాయకుల్ని మోసం చేస్తూ డబ్బులు లాగుతున్న ముఠా సభ్యుడిని గౌరారం పోలీసులు గుర్తించారు. సిద్దిపేట సీపీ అనురాధ, ఏసీపీ పురుషోత్తమ రెడ్డి అదేశాలనుసారం, గజ్వేల్ సీఐ మహేంధర్ రెడ్డి నేతృత్వంలో గౌరారం ఎస్సై వశివకుమార్ బృందం ఈ కేసును ఛేదించారు. గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శికారు పాలెం, పాళ్యపల్లి గ్రామం పుంగనూరు మండలం చిత్తూరు జిల్లాకు చెందిన అదెప్ప (32) జేసీబీతో మట్టి తవ్వుతుండగా బంగారం దొరికిందంటూ.. నమ్మిస్తూ అమాయకులను మోసం చేస్తూ డబ్బులు లాగేవాడు. గత కొద్దిరోజుల క్రితం అదెప్ప గౌరారం సెవెన్ హిల్స్ హెూటల్ వద్ద జగదేవ్ పూర్ గ్రామానికి చెందిన స్వామి (27)తో పరిచయం చేసుకుని తాను జేసీబీతో మట్టి తవ్వుతుండగా 3 కిలోల బంగారం దొరికిందని నమ్మబలికి రూ.20 లక్షలకు అమ్ముతామని నమ్మించాడు. స్వామి తన మిత్రుడు వెంకట్‌తో కలసి చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలంలోని ఎదిగాపల్లికి వెళ్లారు. అక్కడ అదెప్పతోపాటు ఇంద్రరాజు, మహిరాజు, శివ కృష్ణ, రాజధాని, నాగకుమార్, చిన్నలు కలిసి వారికి వారి రెండు గ్రాములు నిజమైన బంగారం ఇచ్చి దానికి పరీక్షించుకోమని చెప్పారు. స్వామి, వెంకట్, దానికి పరీక్షించగా అది నిజమైన బంగారం అని నిర్దారణ చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు చెల్లించి మిగతా డబ్బులు 15 రోజుల్లో చెల్లించాలని చెప్పారు. మే 25 తేదీన స్వామి, వెంకట్, ఇద్దరు 13 లక్షల రూపాయలు ఎదిగాపల్లి గ్రామ సమీపంలోని హెచ్ పీ పెట్రోల్ బంక్ దగ్గర వారికి డబ్బులు ఇచ్చి వారి దగ్గర ఉన్న 3 కిలోల బంగారం తీసుకువచ్చారు. తరువాత బంగారం చెక్ చేయగా నకిలీ అని తేలడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. శనివారం అదెప్ప తండ్రి శానోజీ గౌరారం దగ్గరలోని రాఘవేంద్ర హెూటల్ వద్ద బంగారం గురించి ఎవరితోనో ఫోన్‌లో చెబుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో శానోజిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా నేరం ఒప్పుకున్నారు. అతని దగ్గర నుంచి ఒక ఫోన్, 7 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఆరుగురిని త్వరలోనే పట్టుకుంటామని గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు.

ధరణి భూసమస్యలు వెంటనే పరిష్కరించాలి

భూ రికార్డులు వెంటనే సరి చేయాలి
సీపీఐ(ఏం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్

ధరణి భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని భూ రికార్డులు సరి చేయాలని సీపీ ఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ ధరణి వచ్చిన తర్వాత భూ రికార్డులు మొత్తం తప్పుగా నమోదు జరిగిందని పట్టాదారు రైతులు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేశారని, భూముల విస్తీర్ణం తక్కువ వేయడం అనేక రూపాలలో ధరణి భూ సమస్యలు ఉన్నాయన్నారు. పహానిలో తప్పుగా నమోదు చేయడం వలన తమ పూర్వీకుల నుంచి వ్యవసాయం చేసుకుంటూ తరతరాలుగా వస్తున్న భూములను కోల్పోవడం ఇతరుల పేరుతో మారడం వల్ల రైతులను మానసిక ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ధరణిలో మార్పులు చేసి సులభతరంగా భూ సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామంలో పంచనామ నిర్వహించి న్యాయం చేయాలని. తప్పుగా నమోదు చేసిన రికార్డులను వెంటనే సరి చేయాలని లేనిచో రైతులందరితో కలిసి ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకులు రంగారెడ్డి, ఎండి అహ్మద్, నర్సింలు, రాజు, వెంకటరాముడు, వెంకట చారి తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో మహిళ అరెస్టు

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఫోక్సో కేసులో నిందితురాలైన మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం కు చెందిన సోలంకి అలియాస్ గైక్వాడ్ రాధ తన భర్త, పిల్లలతో కలిసి మూడు సంవత్సరాల క్రితం నుంచి పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ ఆ ఇంటి యజమాని కొడుకు అయిన 16 సంవత్సరాల మైనర్ బాలున్ని తన మాయ మాటలతో లోబరుచుకుని ఆ బాలునితో బలవంతంగా శారీరకంగా కలిసేది. కొన్ని రోజులు గడిచిన తర్వాత ఆ బాలునితో ఎక్కడికైనా వెళ్లిపోవాలనే ఉద్దేశంతో అతన్ని బలవంతంగా ఒప్పించిన నిందితురాలు, బాలుడి ఇంట్లో ఉన్న డబ్బులు, బంగారంను బాలుడితో తెప్పించుకొని జనవరిలో చెన్నై వెళ్లింది. బాలుడి తల్లిదండ్రులు ఆమెపై అనుమానంతో కేసు నమోదు చేయగా, పోలీసులు కేసు పరిశోధనలో భాగంగా టెక్నాలజీ ద్వారా ఆ మహిళ చెన్నైలో ఉన్నట్లు గుర్తించిన సమయంలోనే ఈ నెల 11న ఆమె బాలుడిని సిద్దిపేటలో వదిలేసి వెళ్లిపోయింది. వెంటనే బాలుడి తల్లిదండ్రులు అతన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లగా, తాను తీసుకువెళ్లిన డబ్బు, బంగారం అమ్మగా వచ్చిన డబ్బులను జల్సాలకు ఉపయోగించిందని, తనతో బలవంతంగా శృంగారం చేసిందని చెప్పడంతో ఆ మహిళను పట్టుకొని పోక్సో కేసులో అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి సంఘాల నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు

సిద్దిపేట సీపీ డాక్టర్ బి. అనురాధ



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేటలో జిల్లాలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎవరు కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకొని బలవంతంగా స్కూల్స్ బంద్ చేయించడం చేయవద్దని సిద్దిపేట సీపీ. డాక్టర్ బి. అనురాధ తెలిపారు. స్కూళ్ల వద్దకు వెళ్లి పిల్లలకు ఇబ్బంది కలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, స్కూల్ పిల్లల తరఫున ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థి సంఘాల నాయకులు, డిఈఓకు గాని, సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులకు, కలెక్టర్‌ను గాని కలసి రిప్రజెంటేషన్ ఇవ్వాలని, వారు ఆ సమస్యలపై స్కూళ్ల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని స్కూళ్ల ముందు ధర్నాలు రాస్తారోకోలు చేసి స్కూల్ పిల్లలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్

నవతెలంగాణ-కొండపాక



రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి శనివారం కలిశారు. ఉమ్మడి మెదక్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో మహిళా స్వయం సహకార సంఘాలకు అత్యధిక రుణాలు మంజూరు చేసినందుకుగానూ పంచాయితీ రాజ్ శాఖ మత్యులు సీతక్క ఉత్తమ డీసీసీబీ అవార్డును ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అందుకున్నారు. అనంతరం జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ యువ మోర్చా అధ్యక్షుడు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ యువ మోర్చా అధ్యక్షులు వి.శ్రీకాంత్ చారి శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు సి.గోదావరి అంజిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి బీజేపీ కోసం, ప్రజల సమస్యల గురించి పోరాడుతున్న విధానం నచ్చి పార్టీలో చేరినట్టు శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు టి. రవీందర్ రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో జెఎస్‌డబ్ల్యూ లక్ష్మి మృతి

రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో జెఎస్‌డబ్ల్యూగా పనిచేస్తున్న లక్ష్మి శుక్రవారం అర్ధరాత్రి ఆకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ శనివారం ఉదయం మృతురాలి స్వగ్రామం టేక్మాల్‌కు వెళ్లి ప్రగాఢ సంతపాన్ని తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్, నర్సింగ్ సూపర్డెంట్ స్వరూప, హెడ్ నర్సు సునంద, హాస్పిటల్ లో పనిచేసే నర్సింగ్ ఆఫీసర్స్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



బీసీల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలి

నవతెలంగాణ-కొండాపూర్

తెలంగాణ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి పాటుపడాలని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి.. కులాల వారీగా జనాభా లెక్కలు తీసి పంచాయతీరాజ్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 22శాతం నుంచి 42శాతానికి పెంచాలని కోరారు.నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

నులి పురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం చేయాలి

- ఈనెల 20న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాల్లో, అంగన్వాడీ సెంటర్‌లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



నవతెలంగాణ-సంగారెడ్డి

నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో నులి పురుగుల నివారణ సందర్భంగా జిల్లా కార్యాచరణ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల్లో నులి పురుగుల వల్ల రక్తహీనత బలహీనత, పోషకాహార లోపం, వయస్సుకు తగిన ఎత్తు.. బరువు పెరగకపోవడం, శారీరిక, మానసిక ఇబ్బందులు, చదువుల్లో శ్రద్ధ లేకపోవడం లాంటి అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. దాంతో పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరు అయ్యే ప్రమాదం ఉందన్నారు. కావున నేటి బాలల ఆరోగ్యంగా పెరిగితినే బావి తరం బాగుంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత చేతుల శుభ్రత మొదలగు అంశాలపైన విద్యార్థులకు అవగహన కల్పించాలన్నారు. ఈనెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలో, అంగన్వాడీ సెంటర్‌లో ఆల్బెండజోల్ 400 మాత్రను విద్యార్థులకు వేయించాల న్నారు. మిగితా వారికి 27న వేయించాలన్నారు. జిల్లా వైద్యా అధికారి డాక్టర్ జి. గాయత్రి దేవి మాట్లాడుతూ.. జిల్లాలో ఈ కార్యక్రమానికి సంబందించిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. 1468 ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలు, 68 ప్రభుత్వ ప్రయివేట్ జూనియర్ కళాశాలు 1505అంగన్వాడీ కేంద్రాల్లో ఈ మాత్రాలను వేయించనున్నట్టు చెప్పారు. ఏడాది నుంచి 19 ఏండ్ల వరకు ఉన్నవారు మాత్రమే మాత్ర వేసుకోవచ్చున్నారు. 1 నుండి 2 ఏండ్ల మధ్య వయస్సు వున్నా పిల్లలకు సగం మాత్ర వేయాలన్నారు. రెండేండ్లు దాటినా వారికి ఒక మాత్ర వేయాలన్నారు. 935 మంది ఆశా కార్యకర్తలు, 1505 అంగన్వాడీ టీచర్స్, 1668 పాఠశాల సిబ్బంది, 68 కళాశాల సిబ్బంది ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శశాంక్ దేష్పాండ్, డాక్టర్ సంగారెడ్డి, డీపీఓ సాయిబాబా, డాక్టర్ నాగ నిర్మల, డాక్టర్ సోయబ్, డాక్టర్ చక్రపాణి, సీఈఓ జానకిరెడ్డి, డీటీడీఓ పిరంగి, డీఈఓఏడీ శంకర్, గోవిందారామ్, బాలరాజు, ప్రసాద్ చౌహాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిమ్జ్ భూముల్లో పంటలు వేయొద్దు

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని బర్దీపూర్, చీలపల్లి, ఎల్గోయి గ్రామ శివారులోని నిమ్జ్ ప్రాజెక్టు భూముల్లో రైతులు పంటలను సాగు చేయొద్దని తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. నిమ్జ్ ప్రాజక్టు కింద మూడు గ్రామాల్లో భూములను సేకరించడం జరిగిందని, ఆ భూముల్లో రైతులు పంటలను సాగు చేయవద్దన్నారు. పంటలను సాగు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు వస్తాయని హార్టికల్చర్ అధికారి శైలజ అన్నారు. అంతేకాకుండా ఈ పంట సాగుకు ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా వస్తాయన్నారు. మండలంలోని రేజింతల్ గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ పంట సాగుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1 ఎకరానికి 57 మొక్కలను ప్రభుత్వం సబ్సీడీపై ఇస్తున్నదన్నారు. ఒక్కో మొక్కను రూ.20కే ప్రభుత్వం రైతులకు అందిస్తున్నదన్నారు. అంతే కాకుండా ఈ పంట సాగు కోసం డ్రిప్పులో కూడా రాయితీ కల్పిస్తున్నదన్నారు. ఈ పంటసాగుతో అధిక లాభాలు వస్తాయని.. రైతులకు తప్పకుండా ఈ పంటను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ కంపెనీ అగ్రిటెక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్టికల్చర్ ఆఫీసర్ శైలజ, ఏఈవో సనిత్ రెడ్డి, రేజింతల్ ఎంపీటీసీ మల్లిక శ్రీనివాస్‌రెడ్డి, రైతులు గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బసయ్య సామి తదితరులున్నారు.



పోలీస్ చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

పోలీస్ చట్టాలను అక్రమంగా అమలు చేయాలని తెలంగాణ అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపురం జగన్ అన్నారు. తెలంగాణ అంబేద్కర్ సేవాసమితి, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్‌కి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో ఫిర్యాదులను విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కావున జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో నిస్సహాయులు ఫిర్యాదు చేసిన వెంటనే వారికి రిసిప్ట్ ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ స్పందిస్తూ.. తక్షణమే ఆదేశాలు ఇస్తామన్నారు. ఎస్పీని కలిసిన వారిలో టీపీఎస్ఎస్ జిల్లాకార్యదర్శులు మురారి, సురేష్, ఏబిఏవైఎస్ జిల్లా కార్యదర్శులు, యాదగిరి, రాజు, మొగులయ్య, భుజంగరావు, విద్యాసాగర్ ఉన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

- కళ్యాణ లక్ష్మి చెక్కులు ఇవ్వాలని పలువురి డిమాండ్
- ఆర్అండ్‌బి అధికారుల గైర్హాజర్‌పై ఆగ్రహం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ఇంతకు ముందు సమావేశాల్లో సభ దృష్టికి వచ్చిన అంశాలు ఈ సమావేశం నాటికి కూడా పరిష్కారం కాకపోవడం గమనార్హం. కాగా ఈ సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరవడంతో.. సమావేశం అంతంతమాత్రంగా సాగింది.

ముందుగా సమావేశంలో విద్యుత్ సమస్యలపై రేజింతల్ ఎంపీటీసీ నల్లవల్లి మల్లిక మండిపడ్డారు. విద్యుత్ స్తంభాలు గ్రామాల్లో ఎన్ని వచ్చాయో చెప్పాలంటూ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ డీఈ మాట్లాడుతూ.. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త ఉండాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో గ్రామ పంచాయతీలో ఉన్న అడ్వాన్స్ నిధులను వెంటనే జమ చేయాలన్నారు. పంచాయతీల్లో సమస్యల తాగునీరు, పారిశుధ్యం కోసం నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు అవస్థలు పడుతున్నట్లు సభ దృష్టికి తీసుకు వచ్చారు. మండలంలో 173 కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరైనా.. లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదని వైస్ ఎంపీపీ గౌసోద్దీన్ ప్రశ్నించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలు సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలంలో 15,592 రేషన్ కార్డులు ఉన్నాయని.. ఉమనాపూర్, మలకల్ పాడు గ్రామాల్లో రేషన్ డీలర్‌షిపు ఖాళీగా ఉన్నాయన్నారు. మరోపక్క ఆర్టిక ల్చర్ శాఖలో ఆయిల్ ఫామ్‌కు డ్రిప్పు రాయితీ ఉందని ఆర్టికల్చర్ రైతులు ఉపయోగించుకోవాలన్నారు. మండలంలో మొత్తం 67 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 250 ఉపాధ్యాయులు పని చేస్తున్నారన్నారు. 45 ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులు ఉన్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. 36 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని.. 5 పాఠశాల్లో100 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. అంగన్వాడీలు 63 కేంద్రాలు 2 రేజింతల్, ముంగి అంగన్వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కాగా ఈ సమావేశానికి ఆర్అండ్‌బి అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు మండిపడ్డారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గౌసోదిన్, ఇన్చార్జ్ ఎంపీడీవో సురేష్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహమాన్, మండల అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సాబేర్ హుస్సేన్, లావణ్య, అర్జున్, మారుతీ రాథోడ్, ఎంపీటీసీలు చంద్రన్న పటేల్, జ్యోతి, నల్లవల్లి మల్లిక, సలీం తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యులకు సన్మానం..

జులై 3 తేదీ నుంచి ఎంపీటీసీ సభ్యుల పదవి ముగియనుడడంతో.. సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీటసీల ఫోరం సభ్యులను మండల అధికారులుశాలువాతో ఘనంగా సన్మానించారు. పదవులు కాకుండా చేసిన పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయని నాయబ్ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో సురేష్ అన్నారు. వైస్ ఎంపీపీ గౌసోదిన్ మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి అధికారులు సహకరించారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అంబేద్కర్‌నగర్ ఏ వార్డులో ఉందో తేల్చాలి



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీ ఏ వార్డులోకి వస్తుందో తేల్చాలని రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేద్కర్‌నగర్‌లో రెండో వార్డు ఓటర్లు ఉన్నారని.. అధికారులు ఇంతవరకు ఇది రెండో వార్డు కిందికి వస్తోందా లేక పదో వార్డు కిందికి వస్తోందా తేల్చాలని అధికారులు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తేల్చాలని లేని యెడల కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

కుటుంబ కలహాలతో ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణం నేతాజీనగర్‌లో జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి పట్టణం నేతాజీ నగర్‌కు చెందిన డప్పు మనోహర్ మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఈనెల 3న సాయంత్రం 5.00 గంటలకు తన భార్య విజయలక్ష్మితో గొడవ జరగ్గా.. ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. ఈనెల 10న విజయలక్ష్మి ఫోన్ చేయగా మాట్లాడాడు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో చుట్టు పక్కల, తెలిసిన వాళ్ల దగ్గరి వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో శనివారం రోజున విజయలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే.. సంగారెడ్డి పోలీస్ స్టేషన్ నెంబర్ 08455-27 6333కుగానీ, టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712656718కు సమాచారం ఇవ్వాలన్నారు.

బీఆర్ఎస్‌కు రజితా శేషారెడ్డి రాజీనామా



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు మాజీ వార్డు సభ్యురాలు పెళ్ళకూర రజితా శేషారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాల వల్ల క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఇకపై ఏ పార్టీకి సంబంధం లేకుండా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



అక్రమ గ్యాస్ రీఫిలింగ్

సిలిండర్ పేలి ఒకరికి గాయాలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని ఐడిఏలో అక్రమ గ్యాస్ రీఫిలింగ్ చేస్తుండగా సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐడిఏలో చికెన్ సెంటర్ నడిపిస్తున్న నవీన్ రెడ్డి అక్రమ గ్యాస్ రీఫిలింగ్ నడిపిస్తున్నాడు. అయితే శనివారం ఆయన సోదరుడు నరేంద్రరెడ్డి గ్యాస్ రీఫిలింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో సిలిండర్ పేలింది. దాంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేశాం

- ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు



నవతెలంగాణ-జహీరాబాద్

గత ఐదేండ్లలో జహీరాబాద్ మండలాభివృద్ధికి సాధ్యమైనంత వరకు అన్ని విధాల కృషి చేశామని ఎంపీపీ ఉపాధ్యక్షులు వి.రాములు అన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీపీ అధ్యక్షులు, ఫిలిం డెవలప్మెంట్ సంస్థ చైర్మెన్ గిరిధర్ రెడ్డి సమావేశానికి హాజరుకానందున ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల విత్తనాలు, ఎరువులు అందే విధంగా చర్యలు చేపడుతున్నదన్నారు. ఎవరికైనా విత్తనాలు లభించకపోతే ఎంపీడీవోలను గానీ, వ్యవసాయ శాఖ అధికారులను గానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ఫర్టిలైజర్ దుకాణాదారులకు సూచించారు. నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్అండ్‌బి శాఖలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని.. ప్రభుత్వం నిర్ణయించిన ధర కాంట్రాక్టర్లకు గిట్టుబాటు కానందువలనే ఒక్కొక్క పనికి మూడుసార్లు టెండర్లు వేసినా.. పనులు మాత్రం జరగడంలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. వర్షాలు కురుస్తున్నందున పీహెచ్సీ వైద్యులు మందుల కొరత లేకుండా ముందస్తుగా జాగ్రత్త పడాలని సూచించారు. ఉచిత విద్యుత్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ తక్షణమే అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన హెచ్ఎఫ్సి నిధులు రెండు కోట్లపై చిలుకు టెండర్లు రద్దయినందునా.. వాటన్నింటినీ తిరిగి టెండర్లు చేయనున్నామని.. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి రిజిస్ట్రేషన్ లేని పాఠశాలలపై చర్యలు చేపట్టాలన్నారు. గత ఐదేండ్లుగా సహకరించిన వారందరికీ, అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ నాక్కెట్టి రాథోడ్ మాట్లాడుతూ.. తమతో సాధ్యమైనంతవరకు జిల్లా పరిషత్ నుంచి నిధులు తీసుకువచి గ్రామాల అభివృద్ధికి కేటాయించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఎంపీఓ మహేష్, ఎస్‌సీఎస్ చైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ వంశీ, ఎంఈఓ బసవరాజ్, ఏవో ప్రవీణ, విద్యుత్ శాఖ ఏఈలు సతీష్ ,నాయుడు, పంచాయ తీరాజ్ కోటేశ్వరరావు, జానకిరామ్, అశోక్, ఎంపీటీసీలు మైనుద్దీన్, నర్సింలు, ఇమామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



కోడ్ ముగిసినా.. తొలగించని ముసుగు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని అస్త్రాబల్ ఎఫ్ఆర్ఎస్ ఫల పరిశోధన కేంద్రం గేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఎన్నికల కోడ్ వల్ల అధికారులు గతంలో ముసుగు వేశారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసి ఇన్ని రోజులవుతున్నా.. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ముసుగు తీయలేదు. దీన్నిబట్టి అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతున్నదని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మబ్బు వీడి.. ముసుగు తొలగించాలని కోరుతున్నారు.

మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 168 దుకాణాల సముదాయం పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం మార్కెటింగ్ శాఖ అధికారులతో కలిసి మార్కెట్ యార్డులో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అన్ని రకాల వసతులతో మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు, వ్యాపారులు మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా రూ.20 కోట్లతో 168 దుకాణాల సముదాయం నిర్మిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ మూలంగా నిర్మాణ పనుల్లో జాప్యం ఏర్పడిం దని, త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కూరగాయలు, ఉల్లితో పాటు మేకలు, గొర్రెల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంట ఎన్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎడి మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఈఎస్ఐ డిస్పెన్సరీ ఓపెన్

- ఫలించిన సీఐటీయూ ఆందోళనలు
- స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

రెండు నెలలకు పైగా బంద్ ఉన్న ఈఎస్ఐ జహీరాబాద్ డిస్పెన్సరీని ఎట్టకేలకు శనివారం ఓపెన్ చేశారు. డిస్పెన్సరీని ఓపెన్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక మార్లు ఆందోళనలు చేపట్టిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో శనివారం ఓపెన్ చేయడంతో.. సీఐటీయూ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ.. డిస్పెన్సరీని సందర్శించారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ ప్రాంతం నుంచి సుమారుగా 20 నుంచి 23 లక్షల రూపాయలు ప్రతీనెల ఈఎస్ఐకి వెళుతున్నాయన్నారు. అయినప్పటికీ కనీసం నెలకు రూ.12,000 అద్దె భవనానికి చెల్లించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే సొంత భవనం నిర్మించి 50 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి భవిష్యత్తులో కూడా దశల వారికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా ట్రాక్టర్స్, మహీంద్రా అండ్‌మహీంద్రా, సిఐఈ తదితర పరిశ్రమల సీఐటీయూ నాయకులు గణేష్, నరేష్, సందీప్ రెడ్డి, ఇస్మాయిల్, శ్రీధర్, మహేష్ తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం ఐఎన్టీయూసీ నిరంతర పోరాటం

- ఏషియన్ పెయింట్స్‌లోహమాలీ కార్మికులకు కుదిరిన వేతన ఒప్పందం
- హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల హక్కుల కోసం ఐఎన్టియూసీ నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని ఏషియన్ పెయింట్స్ హమాలి కార్మిక సంఘం అధ్యక్షులు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి అన్నారు. జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి రవీందర్ రెడ్డి, ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ పర్సనల్ మేనేజర్ అమన్ తన్న, కాంట్రాక్టర్ ఉండవల్లి ప్రసాద్, ఏషియన్ పెయింట్స్ హమాలీ కార్మిక సంఘం మధ్య శనివారం ఐదో వేతన ఒప్పందం కుదిరింది. మూడేండ్లకు కలిపి సుమారు రూ.2500 నుండి 3 వేల వరకు పెరిగింది. ఈ సందర్భంగా కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ పటాన్‌చెరు యూనిట్‌లో అఖిల భారత ఐఎన్టియుసి అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆదేశాలతో గత 15 ఏండ్లుగా కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి హమాలీ కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. పాత వేతనంతో పోలిస్తే కుదిరిన వేతన ఒప్పందంతో పరిశ్రమలో అధిక ప్రొడక్షన్ ఉన్న సమయంలో కార్మికులకు 22 వేల నుండి 25 వేల వరకు నెలసరి వేతనం వస్తుందన్నారు. అది ప్రొడక్షన్ వున్న సమయంలో నెలకు ఒక్కొక్క కార్మికునికి 30 వేల వరకు వస్తుందన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, ఓవర్ టైం, బోనస్, లీవ్ విత్ వేజెస్, క్యాంటీన్ సదుపాయం, ఐదు లక్షల డెత్ ఇన్సూరెన్స్ అనేక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో హమాలీ కార్మికుల శ్రేయస్సు కొరకు ఐఎన్టీయూసీ పోరాడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజయ్య, కార్మిక సంఘం నాయకులు రతన్ సింగ్, మల్లేష్, అంబయ్య, చంద్రం గౌడ్, మారుతి, ప్రభు, రవి, శీను తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ని సస్పెండ్ చేయాలి

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్‌కి వినతిపత్రం



నవతెలంగాణ-సంగారెడ్డి

రెస్టారెంట్లు, హొటళ్లు, దాబాల యజమానాలకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తొత్తుగా మారారని.. ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టోరేట్ ఏవో పరమేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా హొటళ్లు, రెస్టారెంట్లు విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలను వినియోగదారులకు వడ్డిస్తున్నాయన్నారు. వారం రోజులుగా కుళ్లిపోయిన చికెన్, మటన్, కుళ్లిపోయిన పదార్థాలతో వంటలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. చెడిపోయి పనికిరాని కూరగాయలను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి.. వంటలకు వాడుతున్నారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై సదరు యాజమాన్యం దాడులు చేస్తున్నదని ఆరోపించారు. ఇంత జరుగుతుంటే సంబంధిత అధికారులు ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి బార్ అండ్ రెస్టారెంట్‌లను తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అనేక హోటళ్లలో ఆహారం తిని ఎంతోమంది అనారోగ్యానికి గురయ్యారన్నారు. కాబట్టి నాణ్యతలేని ఆహారం తయారు చేస్తున్న హొటల్స్ పై చటపరంగా చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సాయి, శ్రీశైలం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

పేట ఎస్ఐ శంకర్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్




పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ పేర్కొన్నారు. శనివారం పెద్ద శంకరంపేట లోని పోలీస్ స్టేషన్ లో బక్రీద్ పండుగను పురస్కరించుకొని హిందువులు ముస్లింల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఎంపిటిసి విణా సుభాష్ గౌడ్ రాయిని మధు దానం పల్లి నారా గౌడ్ రాజేందర్ గౌడ్ భాను గౌడ్ గంగారెడ్డి మాణిక్యం సలీం పెట మండలంలోని హిందూ పెద్దలు ముస్లిం పెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, పలకలు పంచిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నార్సింగి



మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు చేగుంట బీజేపీ నాయకులు వల్లూరు లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు, ఒకటవ తరగతి విద్యార్థులకు పలకలు అందజేసి, అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయురాలు ప్రవళిక, బిజెపి నాయకులు దుబ్బాక కో కన్వీనర్ గోవింద్, మండల ఉపాధ్యక్షుడు రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి దొబ్బల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు ఆంజనేయులు డాక్టర్ నరసింహులు, మాజీ ఉప సర్పంచ్ రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు...

దశాబ్దాలుగా కంకర రోడ్డే దిక్కు..

- పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యం
- కంకరతో రాకపోకలకు తిప్పలు
- మంజూరు ఉన్న పనుల్లో జాప్యం
- జిల్లా అధికారులు దృష్టి సారిస్తే పరిష్కారం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలో గ్రామీణ ప్రాంతాల కనీస సౌకర్యమైన రోడ్లు లేక నిత్యం వెళ్లే ద్విచక్ర వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. పలు గ్రామాలలో రోడ్లు ఎన్నో దశాబ్దాలుగా బీటి రోడ్డుకు నోచుకోవడం లేదు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా బీటి రోడ్డు ఎంత అవసరం అందరికీ తెలిసిన విషయమే. ఎన్ని ప్రభుత్వాలు మారిన గ్రామాల రోడ్లు బాగు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర రోడ్లు దుస్థితి అధ్వాన్నంగా తయారైందని ప్రయాణికులు వాపోతున్నారు. మండలంలో ఆయా 4 కిలోమీటర్ల మేర రోడ్లు హద్నూర్-రామతీర్థం గుంజేటీ, వడ్డీ, రేజింతల్-సిద్ధి వినాయక ఆలయం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి పూర్తి ప్రమాదాలకు నిలయంగా మారాయి ఎంతోమంది జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు ఆలయాలకు వస్తున్నా రోడ్డు మారదా నిత్యం ప్రయాణించే వివిధ రాష్ట్రాల భక్తులకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు ఉన్న పంచాయతీరాజ్ అధికారులు రోడ్లపై చిత్తశుద్ధి లేకుండా కనిపిస్తుంది. సమీప ఆలయాలకు వెళ్లే ఝరా సంఘం, బర్దిపూర్, మల్లన్న గుట్ట, పొట్పల్లి సిద్దేశ్వర ఆలయాలకు వెళ్లాలంటే కంకర రోడ్డులో భయం గుప్పెట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుందని భక్తులు వాపోతున్నారు. ప్రయాణికులు, ప్రజలు వ్యాపారులు, విద్యార్థులు , తప్పని తంటాలు పడుతున్నారు రోడ్లు మంజూరైన తెలిసిన పనులు ఎప్పుడు జరుగు తాయో వేచి చూడాల్సిందే. ఈ రోడ్ల గుండా ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, అత్యవసర పరిస్థితులో గర్భిణీలు ఆసుపత్రులకు వెళ్లాలంటే సమయానికి చేరుకోవడం లేదు. కార్లు ద్విచక్ర వాహనాలు రోడ్లపై రాకపోకలతో పాడైపోతున్నాయని వాహన దారులు తీవ్రంగా మండిపడుతున్నారు. పంచా యతీరాజ్ ఏఈని సమాచారం కోసం సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫోన్ స్పందించలేదు.

ఎన్నో ఏళ్లుగా కంకర మట్టి రోడ్డుపై వెళ్తున్నాం



నిత్యం రాకపోకలు చేసేవారికి ప్రజలకు అవస్థలు పడుతున్నాము. నాలుగు కిలోమీటర్లు పాడైపోయి ఉన్న రోడ్డు మరమ్మత్తుకోసం ఉన్నతాధికారులు చొరవ చూపాలి.
- పాండు, రామ్ తీర్థం గ్రామస్తుడు

అనారోగ్య కారణాలచే వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-దుబ్బాక

ఫిట్స్, కడుపునొప్పి, ఇతర అనారోగ్య కారణాలు భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని దుంపలపల్లి వార్డులో శనివారం జరిగింది. ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుంపలపల్లి వార్డుకు చెందిన సంతోష (32) ఇదే వార్డుకు చెందిన ధర్మారెడ్డి నవనీత్ రెడ్డి ఆరేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. నవనీత్ రెడ్డి ఉద్యోగరీత్యా యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. సంతోష గత ఏడాదిన్నరగా తనలో తాను మాట్లాడుకోవడం, మతిస్థిమితం సరిగా లేకపోవడం, ఇతర అనారోగ్య కారణాలచే బాధపడేది. పలు ఆసుపత్రిలో చూపించి మందులు వాడుతున్నారు. ఈ క్రమంలో తన తల్లిగారి ఊరైన దుంపలపల్లికి 10 రోజుల కిందట వచ్చింది. శనివారం ఉదయం తనకు కడుపు నొప్పి తీవ్రంగా ఉందని డాక్టర్ వద్దకు వెళ్దామని తల్లితో చెప్పగా డాక్టర్‌ను తీసుకురావడానికి తల్లి, పొలం పనుల నిమిత్తం తండ్రి బయటకు వెళ్లారు. సంతోష తన ఇద్దరు పిల్లల్ని బయటకు పంపించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తలుపులు బిగించుకుంది. ఇది గమనించిన పెద్ద కుమారుడు సమీప బంధువైన సావిత్రికి చెప్పాడు. ఇరుగుపొరుగు వారి సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు పరీక్షించి సంతోష అప్పటికే చనిపోయిందని నిర్ధారించారు. భర్త నవనీత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఈటెలను కలిసిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మల్కాజ్గిరి బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ ను నిజాంపేట మండల జడ్పిటిసి, బిజెపి నాయకులు పంజా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కలిశారు. ఆయనకు నిజాంపేట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పంజా బాబు శాలువా కప్పి పుష్పగుచ్చాలిచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ మూడవ సారిగా దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేయడం దేశ అభివృద్ధికి శుభ సూచకమన్నారు. మల్కాజ్గిరి బిజెపిఎంపీగా ఈటెల రాజేందర్ గెలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముదిరాజ్ ముద్దుబిడ్డ రాజేందర్ అన్న తెలంగాణ రాష్ట్రంలోని ముదిరాజుల అందరికీ అండగా ఉంటారన్నారు. ఆయన గెలుపు ముదిరాజ్ కులస్తులకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పంజా బాబు, నవాత్ రాజేంద్రప్రసాద్, ఆముదరాజు, పప్పుల సిద్ధ రాంరెడ్డి, నీలం తిరుపతి , బండారి స్వామి,మేకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీ శాఖ సమీక్ష సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ

నవతెలంగాణ - నార్సింగి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాక కార్యాలయంలో నియోజకవర్గం లోని అన్ని మండలాల పంచాయతీరాజ్ రోడ్ల పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో నార్సింగి జెడ్పీటీసీ బానాపురం కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పంచాయతీ రాజ్ కు సంబంధించిన రోడ్లు, పిఎంజిఎస్వై, ఎంఆర్ఆర్, సిఆర్ఆర్ మరియు ఎస్డిఎఫ్ లకు సంబంధించిన వాటి పై పంచాయతీ రాజ్ అధికారులతో రివ్యూ చేశారు. సమావేశంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలో ఉన్న పాఠశాలలు, పనులు పూర్తి అయిన పాఠశాలలు, పెండింగ్లో ఉన్న పాఠశాలల పై కూడా రివ్యూ చేశారు. రివ్యూ మీటింగ్ లో దుబ్బాక నియోజకవర్గనికి రావలసిన నిధులు, వచ్చిన నిధుల గురించి కూడా అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 47 కొత్త రోడ్లకు ప్రపోజల్ చేసి 105 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ఒక ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసుకోవడానికి కార్యాచరణ రచించారని జెడ్పీటీసీ కృష్ణా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ శాఖ ఏ.సీ, డీ.ఈ, ఈ.ఈ, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ

నవతెలంగాణ-చేగుంట



చేగుంట పట్టణ కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం బడిబాట ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేగుంట మండల నోడల్ ఆఫీసర్ నీరజ హాజరైనారు. వారు మాట్లాడుతూ 30 నెలల నిండిన బాలబాలికలందరూ అంగన్వాడి కేంద్రాల్లో చేరాలని, అదేవిధంగా ఐదు సంవత్సరాలు నిండిన బాలబాలికలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని దాని వినియోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్ వైజర్ షైనీ సువర్ణ, ఉపాధ్యాయులు శారద, రేఖ, సుమతి, విజయలత, రమ చల్లా లక్ష్మణ్, అంగన్వాడి ఉపాధ్యాయులు రేణుక, పద్మస్వర్ణలత సుగుణ, శ్రీ వాణి, తదితరులు పాల్గొన్నారు.

నస్కల్ ప్రైమరీ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-నిజాంపేట్



మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో శనివారం రోజున ప్రైమరీ పాఠశాల లో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు హెచ్ఎం సాగరిక ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు,మధ్యాహ్న భోజనం నాణ్యమైన విద్య అందివ్వడం జరుగుతుందని. తమ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలన్నారు. అంగన్వాడి నుండి వచ్చిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజిని సంధ్య మన్మథ దుబాసి సంజీవ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుమలత, హేమలత వివో ఏ రేణుక కమిటీ మెంబర్లు స్వాతి, మమత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్ పర్వదినానికి గోవద నిషేధించాలి

బజరంగ్ దళ్ నేతలు పోలీస్ స్టేషన్లో వినతిపత్రం

నవతెలంగాణ -వెల్దుర్తి



భారతదేశంలో గోవధ నిషేధ చట్టం అమల్లో ఉన్నప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా గోవులను సంహరించి బహిరంగానే వాటి మాంసాన్ని విక్రయిస్తున్నా ప్రభుత్వం ప్రజాప్రతినిధులు అధికారులు చోద్యం చూస్తున్నారని భజరంగ్దళ్ నేతలు పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొ గోవదను రద్దు చేయాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శనివారం బజరంగ్దళ్ నాయకులు చందు నేత ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఎస్ఐ నవత గౌడ్, తహశీల్దార్ తులసి రామ్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతను వధించడం సరికాదన్నారు. పూర్వకాలం నుండి నేటి వరకు గోవులను పాలిస్తూ వ్యవసాయరంగానికి పాల ఉత్పత్తులకు పూజనీయానికి ఎంతో ఉపయోగించుకుంటున్నామన్నారు. అటువంటి గోవులను వధించడం సరికాదు అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ గణేష్ తో పాటు మరి కొంత మంది ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే బడిబాట

మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ద్వారా సేకరణ పనులు వేగవంతం చేయాలి

క్షేత్రస్థాయిలో బడిబాట మిషన్ భగీరథ ఇంటింటా సర్వే కార్యక్రమాలను లను పరిశీలన

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవ తెలంగాణ-మెదక్ టౌన్





పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం మెదక్ లో మక్త భూపతిపూర్ గ్రామంలో బడిబాట, మిషన్ భగీరథ ఇంటింటా సర్వే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ఒక సామాజిక అవసరమని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి నాగరికతలకు పోటీ ప్రపంచంలో మనుగడ సాధించడానికి విద్య యొక్క ప్రాముఖ్యత చాలా అవసరమని చెప్పారు. అంతకుముందు కలెక్టర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ద్వారా సేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. మక్త భూపతిపూర్ గ్రామంలో మిషన్ భగీరథ సర్వే పనులను కలెక్టర్ పర్యవేక్షించారు. సర్వేకు సంబంధించిన సమగ్ర వివరాలను లబ్ధిదారుల నుంచి సేకరించాలని సర్వే టీం లకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలో 1,60,918 ఇండ్లకు గాను 99,206 ఇండ్లలో ఇప్పటికే 61.68% సర్వే పూర్తయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి



సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి

నవతెలంగాణ-చేగుంట

గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆరు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమని డిమాండ్ చేశారు. చేగుంట మండల కేంద్రంలో శనివారం తహశీల్దార్ గియస్ ఉన్నిస బేగానికి పంచాయతీ కార్మికులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 34 రోజుల సమ్మె చేసిన సందర్భంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందికి ఐదు లక్షల ఇన్సూరెన్స్, దహన సంస్కారాలకు పదివేల రూపాయల సర్క్యులర్ జారీచేసి ఈ స్కీం యొక్క విధివిధానాలు అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ సిబ్బంది అందర్నీ పర్మనెంట్ చేసి, వారికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, కారోబార్ బిల్ కలెక్టర్ సహాయ కార్యదర్శిగా నియమించి పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో ప్రమాదం సంభవించి మరణిస్తే బాధిత కుటుంబానికి రూ,10 లక్షలు ఇవ్వాలని, దహన సంస్కారాలకు రూ, 20 వేలు అందించాలని, అలాగే వారి కుటుంబంలో మరొకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఆంధ్రప్రదేశ్ నాటి గుర్తింపు కార్డులు రద్దుచేసి తెలంగాణ గుర్తింపు కార్డులు పంచాయతీ కార్మికులకు అందించాలని, లేనిచో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు ,ర్యాలీలు నిర్వహిస్తామని, న్యాయమైన డిమాండ్లు సాధించిన తర్వాత పోరాడుతామని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గౌతపూర్ ఆంజనేయస్వామి ఆలయానికి 10 వేల విరాళం

మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తా,చిలిపిచేడ్ మండలాన్ని కాంగ్రెస్ కంచుకోటగా మార్చడమే నా లక్ష్యం....

చిలిపిచేడ్ మండల మాజీ జెడ్పిటిసి చిలుముల శేష సాయి రెడ్డి

నవతెలంగాణ చిలిపిచేడ్



మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి చిలిపిచేడ్ మండల మాజీ జెడ్పిటిసి చిలుముల శేష సాయి రెడ్డి 10 వేల విరాళాన్ని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాడు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి నా వంతు సహాయంగా అందిస్తున్నానని తెలిపారు. చిలిపిచెడ్ మండలానికి ఎన్నో అభివృద్ధి పనులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. మండలంలో జెడ్పిటిసి గా ఉన్నప్పుడు నేను చేసిన అభివృద్ధి పనులు మరిచిపోలేనివని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతవరకు మండలానికి మరిన్ని నిధులు సేకరించి మండల అభివృద్ధికి కృషి చేస్తానని మండలాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. చిలిపిచేడ్ మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మార్చానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అంజిరెడ్డి, విట్టల్, శంకరయ్య శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా మాత్రల పంపిణీ



నవ తెలంగాణ - మిరుదొడ్డి

నులిపురుగుల నివారణ కోసం ప్రతిష్టాత్మకంగా మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని డాక్టర్ సమీనా సుల్తానా అన్నారు. మిరుదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులతో కలిసి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 20వ తేదీన ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ పై సమావేశంలో చర్చించారు. చిన్నారులు రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు నులిపురుగుల మాత్రలు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 20వ తేదీన నిర్వహించే నులిపురుగు కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా పాల్గొని చిన్నారులకు మాత్రలు వేయించాలని సూచించారు. మాత్రలు వేయడం ద్వారా చిన్నారులకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గోవర్ధన్, జెడ్పిటిసి లక్ష్మీ లింగం ,వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి

2 పాడి గేదెలకు రూ 1,80,000 ఆస్తి నష్టం

ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న బాధితుడు

నవతెలంగాణ-చిలిపిచేడ్



విద్యుత్ షాక్‌తో పాడి గేదెలు మృతి చెందిన సంఘటన చిలిపిచేడు మండల కేంద్రంలో శనివారం నాడు చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం చిలిపిచేడు గ్రామానికి చెందిన మల్లుగల్ల సాయిలు 2 పాడి గేదేలు మేత కోసం మేపుకుంటూ చిలిపిచెడ్ శివారులో కి వెళ్ళాడు. స్తంభం పైనుంచి పడి ఉన్న 11 కెవి విద్యుత్ తీగ కింద పడి ఉండడంతో రెండు గేదెల కు ఒకేసారి తగిలి ప్రమాదం సంభవించిందని తెలిపారు. రోజువారీగా కూలీ పనులు చేసుకుంటూ గేదెలపై సాయిలు జీవనాధారం పొందుతున్నాడని అన్నారు. సాయిలు జీవనాధారమైన గేదెలు మృతి చెందడంతో లబోదిబోమంటున్నాడు. సుమారు రెండు గేదెలు రూపాయలు ఒక లక్ష 80 వేల ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ అధికారులు రాములు, స్వామి, రాజు, రూప్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గేదేలు చనిపోవడంతో సాయిలు ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి మహేష్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మహేష్ హెచ్చరించారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలో ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి అని విత్తనాల కొరత లేదని కల్తీ విత్తనాలు అమ్మినా, కృత్రిమంగా విత్తనాల కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో వరి, మొక్క జొన్న, పత్తి విత్తనాలు కొరత లేదని, ఎటువంటి వదంతులు నమ్మవద్దని సూచించారు.తనిఖీల్లో భాగంగా విత్తన దుకాణాలలో రిజిష్టర్లు, బిల్ బుక్కులు పరిశీలించారు. నకిలీ విత్తనాల పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని రైతులకు సూచించారు. వీరితోపాటు మండల వ్యవసాయ అధికారి రమణి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట



బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన అండగా ఉంటామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవా రం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెంది న జంగపల్లి పోచమ్మ (90) అనారోగ్యంతో మర ణించింది. విషయం తెలుసుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 3 వేలు ఆర్థిక సహా యం అందించారు. మృత దేహానికి నివాళి అర్పిం చి సంతాపం ప్రకటించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, నాయకులు బండారు స్వామిగౌడ్, పాత్కుల బాలేష్, ఈదుగాళ్ల పర్శరాములు తదితరులున్నారు.

పట్టపగలే మట్టి తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ములుగు



ములుగు మండల కేంద్రంలోని సంగారెడ్డి కెనాల్‌కు సంబంధించిన స్పైయిల్ బ్యాంక్ లో నిలువ చేసిన ఎర్రమట్టి, మొరం పట్టపగలే అక్రమ రవాణా జరుగుతున్నది. ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న పరిశ్రమల నిర్మాణాలకు ఈ మట్టిని తరలిస్తున్నారు. ఇందుకుగాను సంబంధిత వ్యక్తులు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వాళ్లకు మామూళ్ళ చెల్లిస్తున్నారని భూములు కోల్పోయిన రైతులు ఆరోపిస్తున్నారు. పట్టపగలే అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అదికారులు. పట్టించుకోకుండా, తరచూ తనిఖీలు నిర్వహించి మట్టి అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, కార్యాలయాలకే పరిమితం కావడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

విద్యనే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- ఉన్నత విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్ సింగ్

నవతెలంగాణ-గజ్వేల్



విద్యనే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఉన్నత విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్ సింగ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి. రాజేందర్ సింగ్ సందర్శించారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు దోస్త్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్స్ పొంది, తగిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో తిరిగి కో-ఎడ్యుకేషన్ ప్రారంభమైందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కళాశాల విద్యాశాఖ నిరంతరం కృషి చేస్తుందని, నాణ్యమైన విద్య విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ ఆఫీసర్లు దీపక్ కుమార్, ముఖేష్ కుమార్ హాజరయ్యారు.. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటున్న ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి ని, అధ్యాపకులను, కార్యాలయ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ గణపతి రావు, అధ్యాపకులు డా. ఎస్. రమేష్ బాబు, బాలరాజు, విజయ భాస్కర్ రెడ్డి, రామచంద్రం, డా. పెద్దిరాజు, డా.కవిత, లక్ష్మీనరసయ్య, మార్కాండేయ, ఓం ప్రకాశ్, విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీ శతకము పుస్తక ఆవిష్కరణ

నవతెలంగాణ-తొగుట



విధుశేఖర భారతీ స్వామి శ్రీ సరస్వతీ శతకము పుస్తకం ఆవిష్కరణ చేశారని సహజకవి, అష్టావధాని బండకాడి అంజయ్య గౌడ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరి శారదా పీఠము శ్రీలలితాదిత్య శతావధానంలో జగద్గురువు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వాముల కరకమలములచే సిద్ధిపేట జిల్లా తొగుట మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన సహజకవి, అష్టావధాని అయిన తాను రచించిన శ్రీ సరస్వతీ శతకము ఆవిష్కరించారని తెలిపారు. విధుశేఖర భారతీ స్వాముల చేత సరస్వతీ శతకము ఆవిష్కరించడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మరుమాముల సోదరులు దత్తాత్రేయశర్మ, వెంకటరమణ శర్మ, శతావధాని గన్న వరం లలితాదిత్య, మరో శతావధాని ఆముదాల మురళీ, సంచాలకులు మల్లాప్రగడ, బంగారయ్య శర్మ, కవులు, పండితులు తదితరులు పాల్గొన్నా రని తెలిపారు.

నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

నవతెలంగాణ-కొండపాక



పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం పిల్లలందరికీ ఆల్బెండోజ్ మాత్రాలను పంపిణీ చేయాలని ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. కొండపాక ఐఓసీలో శనివారం నులిపురుగుల నివారణ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వైస్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఎంపీటీసీలు యాదగిరి, ఆంజనేయులు, కొండపాక పిహెచ్ సి వైద్యుడు శ్రీధర్ , ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగను నిర్వహించుకోవాలి

- హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్

నవతెలంగాణ-చేర్యాల



శాంతియుతంగా పండుగను నిర్వహించుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా చేర్యా ల మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం హుస్నాబాద్ ఏసీపీ సతీష్ పట్టణంలో ఉన్న ముస్లిం, తంజుమ్ కమిటీ పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్ మాట్లాడుతూ ముస్లిం సోదరులు అందరూ కలిసి శాంతి సౌభాతృత్వంతో బక్రీద్ పండుగ జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో కూడా ముస్లింలు పండగలు జరుపుకునేటప్పుడు హిందువులు కూడా సహకరించడం మంచి శుభ పరిణామమని, హిందువులు పండుగలు జరుపుకునే సమయంలో ముస్లింలు కూడా సహకరించడం భిన్నత్వంలో ఏకత్వానికి నాంది అని కొనియాడారు. అందరు కలసి ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా పండగలు జరుపుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను,ఎస్ఐ దామోదర్, తంజుమ్, ముస్లిం పెద్దలు,కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో
- ఆ కుటుంబానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బియ్యం, నూనె అందజేత

నవతెలంగాణ-చేర్యాల



కొద్దిరోజుల క్రితం అస్వస్థకు గురై చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందిన చేర్యాల మండలం ముస్త్యాల గ్రామవాసి మేరిండ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిపిఎం ముస్త్యాల గ్రామ శాఖ ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి క్వింటాలు బియ్యం, 15 కిలోల వంట నూనెను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, గ్రామంలో నివసించడానికి కనీసం ఇల్లు లేకుండా అద్దె ఇండ్లలో ఉంటూ పేదరికాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పిల్లల చదువులు, కుటుంబ పోషణ కోసం ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కుటుంబానికి సిపిఎం గ్రామ శాఖ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి రేపాక కుమార్, గుండ్ర రవీందర్, ఎండీ. ఏజాస్, కొంగరి కృష్ణమూర్తి, యాదారం బ్రహ్మయ్య, తరిగొప్పుల సహదేవులు, మైసంపల్లి రాహుల్, కర్ణ కంటి నాగరాజు, గుండ్ర చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధియే శ్రీవాణి విద్యాసంస్థల లక్ష్యం

- 25 సంవత్సరాలుగా విద్యా సేవలు అందిస్తూ మన్ననలు
- పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం





నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో 25 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తూ, విద్యార్థుల అభివృద్ధియే తమ అభివృద్ధిగా పనిచేస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీవాణి పాఠశాల (రెడ్డి సంక్షేమ భవనం పక్కన, రాజీవ్ రహదారి). గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు, మానవీయ విలువలను, నీతిని నేర్పిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న విద్యాసంస్థ. గత 25 సంవత్సరాలుగా పాఠశాల యాజమాన్యం మారకుండా, ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకొని, ప్రతి విద్యార్థిపైన ప్రత్యేకమైన శ్రద్ధతో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. సిద్దిపేటతో పాటు, దుబ్బాక, ముస్తాబాద్, ఇల్లంతకుంటలలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి విద్యా బోధన చేస్తున్నారు. ఎస్ఎస్‌సి ఫలితాలలో ప్రతి సంవత్సరం 10 జీపీఏ పాయింట్లను సాధిస్తున్న విద్యాసంస్థ.

అద్భుతమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య శ్రీవాణిలో

మంచిగా చదువు చెప్పే స్కూల్స్ కొన్నే ఉంటాయి. కానీ విద్యార్థులకు సౌకర్యాలను కల్పించడంలో అంతంత మాత్రంగానే ఉంటాయి. మరికొన్ని స్కూల్స్‌లో అధికమైన ఫీజులతో అద్భుతమైన సౌకర్యాలు ఉంటాయి. చదువు ప్రోగ్రాం అంత పటిష్టంగా ఉండవు. ఫీజులు అందుబాటులో ఉండవు, అద్భుతమైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అన్ని హంగులతో పిల్లలు భవిష్యత్తు బాగా ఉండాలి అంటే శ్రీవాణి పాఠశాలలోనే సాధ్యం. ఐఐటి/జే ఈ ఈ, ఎన్ ఈ ఈ టి, సి ఏ, బిట్ సాట్, ఇఏపీసెట్‌లో ప్రత్యేక బోధన అందిస్తున్నారు.

స్కూల్ స్థాయిలో విద్యా విధానం

2.0 ఎడ్యుకేషన్, అండర్ స్టాండింగ్ లెవల్ పిల్లలకు స్కూల్ స్థాయిలో ఐఐటీ ఫౌండేషన్ ఉంటుంది. మిగిలిన వారికి చదువులో స్లోలేర్నర్స్‌కు ఒక ప్రత్యేకమైన, నెమ్మదిగా, రిపీటేటివ్‌గా బోధించే విద్యావిధానం ఉంటుంది. ఫండమెంటల్స్‌తో కూడిన కాన్సెప్ట్ టీచింగ్ ప్రత్యేకంగా ఉంటుంది. ప్రతి విద్యార్థిపై విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా పటిష్టమైన విద్యావిధానం, ప్రతి తరగతి గదిలో లిమిటెడ్ విద్యార్థులతో బోధన. ఆడియో, వీడియో సౌకర్యం ఉంటుంది. రోజు వారి పరీక్షలు, వారంతంలో గ్రాండ్ టెస్ట్, బిట్స్ టెస్ట్ ఉంటాయి.

మార్కుల పరంపర

- 2001లో 7వ తరగతి ఫలితాలలో ఆర్. శ్రవణ్ కుమార్ 562 మార్కులు సాధించి జిల్లాలోనే మొదటి స్థానం పొంది, ప్రతిభ అవార్డు సాధించారు
- 2005 నవోదయ ఫలితాలలో కే. స్నేహ 100మార్కులకు 98 మార్కులు పొంది రాష్ట్ర స్థాయి లో మొదటి ర్యాంక్ సాధించారు
- 2005 ట్విన్ స్పీటీస్ టాలెంట్ టెస్ట్‌లో ఆర్.ప్రవీణ్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ సాధించారు.

2006 జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ట్రాఫిక్ రూల్స్ అంశంపై ప్రదర్శనలో మొదటి స్థానం.

- 2007 ఆర్డీఓ నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో మొదటి స్థానం.

2008 ఇన్స్పైర్ అవార్డ్స్‌లో ఐదుగురు విద్యార్థులకు జిల్లా మొదటి స్థానం

- 2009 బాసర ట్రిపుల్ ఐటీలో ఎం. గోపి సీటు సాధించారు.
- 2010 సంవత్సరంలో 10వ ఫలితాలలో ఆర్. ప్రవీణ్ 576 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్ పొంది, బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు.

2011లో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయి మొదటి స్థానం సాధించారు.

- 2012 సంవత్సరంలో 10వ ఫలితాలలో 10/10 జిపిఏ సాధించిన విద్యార్థులు కే.అఖిల్ ఇదుపుల పాయలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఎస్. వినయ్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు.
- 2013లో బాసర ట్రిపుల్ ఐటీలో కే.అశోక్, కే. ప్రశాంత్ సీట్లు సాధించారు.
- 2014లో 100 మీటర్ల పరుగు పందెంలో కే. వాణి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించారు
- 2016 చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.
- 2022లో కబడ్డీ, ఖోఖోలో రాష్ట్ర స్థాయికి ఎంపిక.
- 2023లో కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, లాంగ్ జెంపు పోటీలలో రాష్ట్ర స్థాయిలో గెలుపొంది, జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు విజయం సాధించారు. చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయం మానసిక ఉల్లాసం కొరకు విహార యాత్రలు, తరగతి బోధనతో పాటు ప్రత్యక్ష పద్ధతి బోధన కొరకు ఫీల్డ్ ట్రిప్స్ ఉంటాయి.

"చదువే మనిషికి తేజస్సు అది పంచడమే శ్రీవాణి తపస్సు" గా 1999 నుంచి 2024 వరకు విద్యార్థుల శ్రేయస్సుకు శ్రీవాణి ఎప్పుడు సిద్ధమే.

నామినేటెడ్ పదవులపై నర్సారెడ్డి కసరత్తు

- వారం రోజుల్లో అధికార ప్రకటన
- గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నరేందర్ రెడ్డి
- వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ పార్టీకి కష్ట కాలంలో కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలు గుర్తించి నామినేట్ పదవులను భర్తీ చేసేందుకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రెండు రోజులుగా కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే గజ్వేల్, కొండపాక, వంటిమామిడి, మార్కెట్ కమిటీలు ఉండగా నాచారం, కొండపోచమ్మ దేవస్థాన కమిటీలు ఉన్నాయి. ఇందులో మార్కెట్ కమిటీలు, దేవస్థాన కమిటీలకు పాలకవర్గాన్ని నియమించేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖకు ఇప్పటికే గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వడం జరిగింది. నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్న పలువురు నాయకులను బుజ్జగించులు ప్రారంభమయ్యాయి. గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్గా జగదేవ్పూర్ మండలం గొల్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా గజ్వేల్ పట్టణానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు సర్దార్ ఖాన్‌కు దక్కనున్నట్లు పార్టీ వర్గాలతోపాటు సోషల్ మీడియా షేక్ చేస్తుంది. అదేవిధంగా కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్గా మొదటిసారి విరుపాక్ష శ్రీనివాస్ రెడ్డి వైపు నర్సారెడ్డి దృష్టి పెట్టినట్టు తెలుస్తుంది. కొండపాకను కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మార్చాలంటే వీరుపాక్ష నరేం దర్ రెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని పలువు రు ఇప్పటికే నర్సారెడ్డిపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఒంటిమా మిడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వర్గల్ మండలం మాజీ ఎంపీపీ మోహన్ సతీమణి విజయ పేరును ఖరారు చేసిన ట్టు తెలుస్తుంది. వైస్ చైర్మన్‌గా అదే మండలానికి చెందిన గంగశక్తి ప్రభాకర్కు వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది. కొండపోచమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్‌గా జయపూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పీర్లపల్లి మాజీ సర్పంచ్ కేసు రెడ్డి రవీందర్ రెడ్డి లేదా డెవలపర్ గ్రామానికి చెందిన బంగారు రెడ్డికి ఇచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నా యి. నాచారం దేవస్థానం కమిటీ సైతం నియమించేందుకు కసరత్తు చేసినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో ముఖ్యమైన నాయకులను ఇతర పదవుల్లో నియమించేందుకు నర్సారెడ్డి వారిని బుజ్జగించు కున్నట్లు తెలుస్తుంది. కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో గజ్వేల్ నియోజకవర్గంలోని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తున్నట్టు సమాచారం.

నేటితో యుటిఎఫ్ రైతు సదస్సుకు 20 ఏండ్లు

నవతెలంగాణ-గజ్వేల్



ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్ పట్టణంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో సంఘ నాయకుడు వి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ఆదివారంతో 20 ఏండ్లకు చేరుకుంటుంది. 2004 జూన్ 16వ తేదిన స్థానిక రామాలయం ప్రాంగణంలో భారీ రైతు సదస్సు ఘనంగా నిర్వహించారు. 2004 వరకు వచ్చిన కరువు వలన రాష్ట్రవ్యాప్తంగా వందలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో వారిలో ధైర్యం ఆత్మవిశ్వాసం పెంపొందించుటకై యూటీఎఫ్ రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాటి గజ్వేల్ మండల అధ్యక్షుడు ఎంసీ రాజయ్య, సర్పంచ్ ఉప్పల పద్మ మెట్టయ్య, జెడ్పిటిసి అనసూయ, వర్గల్ జడ్పిటిసి నరసింహ చారి, జెడ్పిటిసి రఘుపతిరావు, నరసింహారెడ్డి, సీపీఎం నాయకులు టి. బాలకృష్ణారెడ్డి, యుటిఎఫ్ నాయకులు కృష్ణమూర్తి, రమణయ్య శాస్త్రి,రియాజ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,లు పాల్గొని ప్రసంగిస్తూ తమ సందేశాలలో రైతులలో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. రైతులు మాట్లాడుతూ కరువు వలన నెలకొన్న పరిస్థితులను తెలుపుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సు అనంతరం అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి అనేక రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగింది ఈ రైతు సదస్సుకు 20 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు వి సత్యనారాయణ మాట్లాడుతూ యుటిఎఫ్ ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘం అని, రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుటకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో రైతు సదస్సును ఒక బాధ్యతగా నిర్వహించామని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామనడం హర్షణీయమని, మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు.

విలువలతో కూడిన విద్యతోనే మంచి సమాజం

- మధుసూదన సాయి సేవలు స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-కొండపాక



సమాజంలో నైతిక విలువలు పతనం అవుతున్న తరుణంలో విద్యార్థినులకు విలువలతో కూడిన విద్యను అందించి అందించినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని సిద్దిపేట జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, సిద్దిపేట రామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి నేతి కైలాసం, విస్తరాకు పరిశ్రమ నిర్వాహకులు వేణుగోపాల్, మాధవిలు అన్నారు. శనివారం కొండపాక లో ఉన్న శ్రీ సత్య సాయి ప్రశాంతి నికేతనం మహిళా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఉన్నత విలువలను కాపాడి భవిష్యత్ తరానికి అలవర్చే విధంగా సద్గురు మధుసూదనా సాయి చేస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ముందుగా సద్గురు శ్రీ మధుసూదనా సాయి వారి ఆశీస్సులతో ప్రతి విద్యార్థినికి రూ.30 వేల విలువచేసే నిత్యావసర కిట్ (యూనిఫార్మ్, బ్లాంకెట్స్, స్వెటర్, షూస్, రోజువారి దుస్తులు, నిత్యావసర వస్తువులు)లను వారి చేతుల మీదుగా 110 మంది విద్యార్థులకు అందజేశారు. ఆధునిక యుగంలో సనాతన ధర్మం కోసం, విలువల కోసం మధుసూదనా సాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సద్గురు నీడలో ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎంతో అదృష్టవంతులన్నారు. జీవితం చాలా చిన్నదని, సన్మార్గంలో నడవడం ఎంతైనా అదృష్టం అన్నారు. సమాజానికి సేవ చేయాలనే తలంపు ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. అవకాశాలను వినియోగించుకోవాలని, తద్వారా సనాతన ధర్మం కోసం కృషి చేయాలన్నారు. కృతజ్ఞతా భావాన్ని ఎవరు మరచిపోకూడదని అన్నారు. భగవంతుడు ఎక్కడో లేడని మనిషి రూపంలోనే ఉన్నారని అన్నారు. విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ఈ కళాశాలలో జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, మంచి ఆలోచనలతో విద్యార్థులు పైకి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను కళాశాల చైర్పర్సన్ పూర్ణిమ శంకర్, కళాశాల కార్యదర్శి మహాభాష్యం శంకర్ రావులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎకాడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్ పర్సన్‌లు రేష్మ, జయశ్రీ, మానసలతోపాటు కళాశాల ఇంటర్న్స్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు..

రుద్రేశ్వరాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

- ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండల కేంద్రంలో గల రుద్రేశ్వరాలయాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు ప్రతినిధులు వెంకటరమణ శర్మ , అనంతుల శ్యామ్ మోహన్ ఆధ్వర్యంలో పూజారులు జిల్లా కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయ విశిష్టతను, చరిత్రను జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో నిర్మాణంలో గల రహదారి వెడల్పు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర, విశిష్టత కలిగిన కొండపాక రుద్రేశ్వరాలయాన్ని సందర్శించి, పూజ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి, నిర్మాణంలో ఉన్న రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు అదేవిధంగా గ్రామాభివృద్ధికి జిల్లా అధికార యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఎంపీపీ మంచాల అనసూయ కనక రాములు, మాజీ ఎంపీపీ బద్దుల కనకయ్య ,మాజీ సర్పంచ్ చిట్టి మాధురి, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతల ప్రశాంత్, దేవాలయ ట్రస్ట్ కోశాధికారి రేణిగింది బాలయ్య, పిసిసి సభ్యుడు గంప మహేందర్ , అరుట్ల కనకయ్య, ఆరె భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆయిల్ ఫామ్ పంటతో అధిక రాబడి

నవతెలంగాణ -నంగునూరు



ఆయిల్ ఫామ్ పంటతో అధిక దిగుబడితో పాటు రాబడి పెరుగుతుందని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు బద్దిపడగ కిష్టారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిప్పని నాగేందర్ తెలియజేశారు. శనివారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటను అమ్మిన మూడు, నాలుగు రోజుల్లోనే అకౌంట్ లో డబ్బులు పడ్డాయని చెప్పారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి, నంగునూరు, మైనంపల్లి గ్రామాల్లో ఆయిల్ ఫామ్ మొట్ట మొదటి క్రాఫ్ కటింగ్ జరిగిందన్నారు. పంట పండినందుకు రైతుగా ఎంత ఆనందంగా ఉందని తెలియజేశారు. జూన్ 2021 లో నంగునూరు మండలం మైనంపల్లి, అక్కెనపల్లి, నంగునూరు గ్రామాల్లో ఈ పంటను మొదటి సారి వేయడం జరిగిందన్నారు.అలా మూడేళ్ల క్రితం ఆయిల్ ఫామ్ సాగు నంగునూరు మండలంలో ప్రారంభించామన్నారు. జాప శ్రీకాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి తిప్పని నాగేందర్ పొలంలో మొదటి ఆయిల్ ఫామ్ మొక్క నాటామని ముగ్గురు తోటలో మొదటి పంటను కోసి అమ్మామని తెలిపారు. ఆయిల్ ఫామ్ ప్రకృతి ప్రసాదించిన వరమని రైతులు ఎదగడానికి దోహదపడుతుందన్నారు. ఇది చాలా సులువైన పంటని స్థిరమైన ఆదాయమని ఏడాది అంతా లాభమేనన్నారు. దళారి వ్యవస్థ లేదు. ధర రాదు అనే బాధ లేదని ఆయిల్ ఫెడ్ ద్వారా నేరుగా ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. పంట కోసిన తరవాత రవాణా ఖర్చులు ఆయిల్ ఫెడ్ పరిశ్రమనే చెల్లిస్తుందన్నారు. ప్రస్తుతం పంటకు టన్నుకు రూ.13,438 లు వస్తుందన్నా రు. మండలంలో 1700 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు అవుతుందని తెలిపారు. పంటను వేసేందుకు ప్రోత్సాహించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహించాలని కోరారు.

మానవ మృగాన్ని పోక్సోచట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ- గజ్వేల్



అభం శుభం తెలువని అరేళ్ళ బాలికలను అపహరించి అత్యాచారం చేసిన మానవ మృగాన్ని పోక్సో చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల్ కాట్నపల్లి క్రాస్ రోడ్ రైస్ మిల్ వద్ద గురువారం రాత్రి మద్యం మత్తులో ఆరేళ్ల చిన్నారిని అపహరించి అత్యాచారం చేయడం ధారుణమన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటుపడి సమాజానికి ముంపుగా, పసిపిల్లల పాలిట యమకింకరుగా మారుతున్నారనన్నారు. కట్నపల్లి రైస్ మిల్‌లో పనిచేస్తున్న వలసకూలి పొత్తిళ్ళలో పడుకున్న అర్నెళ్ళ పసిపిల్లను అదే మిల్ లో పనిచేస్తున్న కిరాతకుడు అపహరించి అత్యాచారం చేసి హత్యచేసిన దుర్మార్గుడిని పోక్సో చట్టం ప్రకారం కఠినాతి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వలస కార్మికుల పిల్లలకు భరొసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సినియర్ దళిత నాయకులు మాసాన్ పల్లి మైసయ్య, క్యాసరం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్ రావును విమర్శించే అర్హత రఘునందన్‌కు లేదు

నవతెలంగాణ-సిద్దిపేట



శ్రీరాముని పేరు చెప్పుకొని గెలిచిన రఘునందన్ రావుకు బీఆర్ఎస్ పార్టీని, హరీశ్ రావుని విమర్శించే అర్హత లేదని బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు బిజెపి గెలుపు కోసం పనిచేశారని రఘునందన్ రావు వ్యాఖ్యానించడం ఆయన మూర్ఖత్వమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఓడింది బిజెపి చేతిలోనో, మోడీ చేతిలోనో కాదని శ్రీరామునితో ఓడిపోయిందని తెలిపారు. బీజేపీకి ఓట్లు వేస్తే శ్రీరామునికి ఓట్లు వేసినట్లే అని చెప్పి రఘునందన్ రావు గెలిచాడన్నారు. దుబ్బాక ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం వల్లే అక్కడ ప్రోటోకాల్ లేకుండా పోయిందని, సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రఘునందన్ రావుకు ఇక్కడ కూడా ప్రోటోకాల్ లేకుండా పోతుందన్నారు. ఒక కలెక్టర్‌గా ప్రాజెక్టుల కోసం భూమి సేకరిస్తే అది వెంకట్రాంరెడ్డి తన సొంతానికి తీసుకున్నట్లుగా ఆరోపించడం ఆయన అవివేకమన్నారు. భూనిర్వాసితులకు తాను ఏమి చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. ఇకనైనా రఘునందన్ రావు బీఆర్ఎస్ నాయకులపై, పార్టీపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనకరాజు, మహేష్, నరసింహులు, రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
ఆదివారం | 16 జూన్ 2024 | www.navatelangana.com

మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి

- యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్

నవతెలంగాణ-సిద్దిపేట



మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహించడానికి సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల ద్వారా మహిళ సాధికారత సాధించడానికి తమ వంతుగా సహకారం చేస్తామని యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారితో ప్రణాళిక చేయడం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా ముందుగా విద్యార్థులకు, మహిళలకు వ్యక్తిగత, గ్రూప్ ల వారీగా అందుబాటులో వున్న పథకాల (ప్రధాన మంత్రి జాన్ ధన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, యూనియన్ ముసాన్) ద్వారా స్కిల్ డెవలప్మెంట్, వ్యాపార రంగం లో ముందుకు తీసుకువచ్చే విధంగా నైపుణ్యాలను , ఆర్థికంగా ఎదగడానికి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న రైతులు



నవతెలంగాణ-ములుగు: జనుము జీలుగు విత్తనాల కొరకు అడవి మసీదు గ్రామా నికి చెందిన రైతు పెద్దల్లో బిక్షపతి గత మూడు రోజులుగా మండలంలోని వ్యవసాయ కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. రైతుకు అధికారులు మాత్రం సరైన వివరణ ఇవ్వడం లేదు. ఆఫీసుకు వెళ్లి అధికారులకు ఫోన్ చేయగా, 672 ఎకరాలకు మాత్రమే విత్తనాలు వచ్చాయని అధికారులు తెలిపారు. ములుగు మండలంలోని మొత్తం వరి సాగు 7000 ఎకరాలలో సాగు చేస్తున్నారు, దానికి 672 ఎకరాలకు మాత్రమే విత్తనాలు వచ్చాయని అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రగతి ఏఈఓ పృధ్వీరాజ్ తెలిపారు.

కోహెడలో కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత

నవతెలంగాణ-కోహెడ



కోహెడ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద శనివారం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ 105 చెక్కులను ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ చేతులమీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలలో వెలుగులు నింపాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, వైస్ఎంపీపీ తడకల రాజిరెడ్డి, ఎంపీటీసీ జాగిరి కుమారస్వామి, కోనె శేఖర్, పూల విజయ, వేముల శ్రీనివాస్, నిర్మల, మల్లవ్వ, ఆర్ఐ హరీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల వెంకటస్వామి, బందెల బాలకిషన్, శెట్టి సుధాకర్, తిరుపతిగౌడ్, లబ్దిదారులు పాల్గొన్నారు.

పేద పద్మశాలి విద్యార్థులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ- సిద్దిపేట

సిద్దిపేట జిల్లా పరిధిలోని పేద పద్మశాలి విద్యార్థులు 2023-24 సంవత్సరంలో పదవ తరగతి , ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న వారికి సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకుఆర్థిక సహాయం అందించడానికి పద్మశాలీల దాతల నుంచి విరాళాలు స్వీకరించనున్నామని తెలిపారు. పద్మశాలి విద్యా కమిటీ ద్వారా పేద విద్యార్థులను గుర్తించి, త్వరలో వారికి ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఎస్ ఎస్ సి మెమో జిరాక్స్, విద్యార్థి తండ్రి సెల్ నెంబర్ ఇంటర్మీడియట్ విద్యార్థులు వారి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ మెమో, విద్యార్థి తండ్రి సెల్ నెంబర్‌తో సహా కింది అడ్రస్‌కు ఈనెల 30 లోపల పోస్ట్ చేయాలని కోరారు. రోహిణి వెటర్నటీ అండ్ నర్సింగ్ హెూమ్, ఇంటి నెంబర్ 8-2-106/2, శివాజీ నగర్, సిద్దిపేట. పూర్తి వివరాలకు 9848134401 నెంబర్ సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జోగు బిక్షపతి, వంగరి శ్రీశైలం పాల్గొన్నారు.

నేడు గజ్వేల్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు

- ప్రతి పాఠశాలలో కరపత్రం విడుదల చేసిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ- గజ్వేల్



టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో జరిగే విద్యా సదస్సు విజయవంతం చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ రాజులు పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ మండలంలో వివిధ పాఠశాలలల్లో టిపిటిఎఫ్ విద్యా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో టీపీటీఎఫ్ అధికార మాసపత్రిక "ఉపాధ్యాయ దర్శిని" ప్రధాన సంపాదకులు ప్రకాష్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా టీపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సదస్సుకు ఉపాధ్యాయులు, మేధావులు, విద్యా అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వఅధ్యక్షులు రాంచంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవెల్లి మల్లికార్జున్, గజ్వేల్ జోన్ కో కన్వీనర్ గోకవిద్యసాగర్, గజ్వేల్ అధ్యక్షులు పాపగారి పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, సీనియర్ కార్యకర్తలు ఎల్లయ్య కరుణాకర్, సురేష్, హఫీజ్, రమేష్, హరిబాబు, మోహన్ రావు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల ఆర్థిక సాయం

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన మేరిండ్ల శ్రీనివాస్ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న చేర్యాల మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పార్టీ తరుపున రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కర్ణాకర్,సర్పంచ్ ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యూత్ నాలుగు మండలాల అధ్యక్షులు శివగారి అంజయ్య, నాయకులు కొంగరి గిరిధర్, సాయి, జగన్, చింతల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నీటి శుద్ధికరణ యంత్రం బహుకరణ

నవతెలంగాణ-రాయపోల్



మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సహకారంతో ఎల్కల్ ప్రాథమిక పాఠశాలకు నీటి శుద్ధీకరణ యంత్రం బహుకరించడం జరిగిందని బిజెపి ఎల్కల్ గ్రామ అధ్యక్షులు పిట్ల బాలమల్లు అన్నారు. శనివారం రాయపోల్ మండలం ఎల్కల్ ప్రాథమిక పాఠశాలకు నీటి శుద్ధికరణ యంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్కల్ ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని రోజులుగా విద్యార్థులు స్వచ్ఛమైన త్రాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గతంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకళ్తే విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు కృషి చేద్దామని నీటి శుద్ధికరణ యంత్రం అందించడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుతుందని దానితో విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడినవారమవుతామని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు తరపున గ్రామం తరపున ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి శిరీష, గ్రామ పంచాయతీ కార్యదర్శి జావీద్, పాఠశాల ఉపాధ్యాయులు నరసింహ, నరేష్, కరుణాకర్, బిజెపి ఓబీసీ మండల ఉపాధ్యక్షులు ప్రసాద్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు నవీన్, నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవానికి ముస్తాబైన ఎల్లమ్మ గుడి

నవ తెలంగాణ-రాయపోల్



రాయపోలు మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి జమదగ్ని కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు వేద పండితులు చేత కళ్యాణ మహోత్సవం నిర్వహించడానికి దేవస్థానాన్ని రంగురంగులతో విద్యుత్ కాంతలతో ముస్తాబు చేశారు. ఆదివారం 16 వ తేదీన ఉదయం గం. 08-30 ని.ల నుంచి గణపతి పూజ, స్వస్తి వాచనం, మాతృక పూజ, అఖండ దీపస్థాపన, రక్షాబంధనం, పంచగవ్యప్రసానం, ఋత్విక్కరణం, యోగిని, వాస్తుపూజ, సర్వతో భద్ర మండలం, క్షేత్రపాలక పూజ, ప్రధాన కలషస్థాపన, అంకురారోపన, నవగ్రహ పూజ, సర్వ దేవతాపూజలు, అగ్నిప్రతిష్ఠ తీర్థ ప్రసాద వితరణ జరుపబడును. అదే రోజు సా. 5-00 గంటల నుంచి గ్రామదేవతాలకు బోనాలు నిర్వహించబడును. సోమవారం 17 వ తేదీన ఉదయం గం. 8-00 ల నుంచి స్థాపిత దేవతాపూజలు, సర్వ దేవత హమనం, రేణుకా ఎల్లమ్మకు పంచామృత అభిషేకం, మూల మంత్ర హవనం, బలి ప్రధానం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం, ఋత్విక్ సన్మానం, మంగళహారతి, మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ జరుగును.అదే రోజు మంగళవారం తెల్లవారు జామున ఉ. 3-00 గం.ల నుంచి శ్రీ రేణుక ఎల్లమ్మకు బోనాలు నిర్వహించబడును. మంగళవారం 18 వ తేదీన ఉ. గం.11-35 ని.లకు అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి-జమదగ్ని కళ్యాణం వేద పండితుల చేత కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. కావున రాయపోల్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో ఈ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసి విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని రాయపోల్ గౌడ సంఘం భక్త బృందం కోరడం జరిగింది.



వికలాంగుల బ్యాక్ లాగ్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

- జూలై 13 న జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలి
- ఎన్‌పీఆర్‌డీ సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షులు జీ.భాస్కర్

నవ తెలంగాణ -దుబ్బాక



వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సబ్ ఆర్డినేట్ సర్వీస్ రూల్స్ లను సవరించాలని ఎన్‌పీఆర్‌డీ సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షులు జీ.భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాక పురపాలక కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎండీ సాజీద్ అధ్యక్షతన వికలాంగుల హక్కుల జాతీయ వేదిక దుబ్బాక ప్రాంతీయ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ పీఆర్ డీ సిద్దిపేట జిల్లా గౌరవాధ్యక్షులు జీ.భాస్కర్ మాట్లాడుతూ...2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21శాతం మంది వికలాంగులు ఉన్నారని గణాంకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక గణాంకాల విభాగం విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం 19 శాతం మంది చూపు, వినికిడి లోపం కలిగి ఉన్నారని తెలిపారు. 8శాతం మంది బహుళ వైకాల్యం కలిగి ఉన్నారని తెలిపారు.76శాతం మంది గ్రామీణ ప్రాంతంలో,24శాతం మంది పట్టణ ప్రాంతంలో నివసిస్తున్నారని అన్నారు.ప్రభుత్వప్రభుత్వయేతర సౌకర్యాలు వికలాంగులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వికలాంగులు ఉంటే పెన్షన్స్ కేవలం 5.75లక్షల మందికే వస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను ప్రకటించి,ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గిస్తూ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ సవరించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వప్రయివేట్ భాగస్వామ్యంతో ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.వికలాంగులపై జరుగుతున్న వేధింపులు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. తీవ్ర వైకల్యం కలిగి ఉన్న వికలాంగులకు ప్రత్యేక అలవెన్స్ లు ఇవ్వాలని నిర్ణయం చేసినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెండింగ్ లో ఉన్న వివాహ ప్రోత్సాహక నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.అధికారులు వారి వైఖరి మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఎన్ పీఆర్ డీ సిద్దిపేట జిల్లా 3వ మహాసభ జులై 13న సిద్దిపేట పట్టణంలో నిర్వహిస్తున్నామని జిల్లా వ్యాపితంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని వెల్లడించారు. ఈ మహాసభల్లో జిల్లాలో వికలాంగుల సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.ఈ సమావేశంలో వికలాంగులు లక్ష్మీనర్సయ్య, యాదయ్య,కిష్టయ్య, శివయ్య,చంద్రయ్య,నవీన్,గోవర్ధన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా ప్రజా వేదిక

- పొరపాట్లను సరిచూసుకోవాలి

నవతెలంగాణ -నంగునూరు



పనుల్లో చేస్తున్న పొరపాట్లను సరిచేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని అడిషనల్ డీఆర్డీడీఓ పి.బాలక్రిష్ణ సూచించారు.శనివారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయం ముందు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ, ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై బీఆర్పీలు నివేదికలను చదివి వినిపించారు.ఈజీఎస్ పథకంలో మొక్కలు ఎండిపోతున్నాయని, మస్టర్లు సరిగా రాయడం లేదని, జరిగిన పొరపాట్లను సూచించి సంబంధిత పనులు చేయించిన వారి నుంచి రికవరీ చేపట్టాలని ఏపీడీ ఆదేశించారు. పనుల్లో చాలా వరకు అవకతవకలు జరిగాయని మరోసారి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పని ప్రదేశాలలో సరైన వసతులు ఎందుకు కల్పించలేదని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ లను ఏపీడీ ప్రశ్నించారు.ప్రభుత్వం నుండి ఉపాధి కూలీలకు సామాగ్రి రాలేదని ఫీల్డ్ అసిస్టెంట్లు తెలియజేశారు.నంగునూరు మండలంలో 1348 పనుల్లో కూలీలకు రూ. 6,53,09,187 లు, మేటీరియల్ రూ .51,82,597 లు మొత్తం రూ.7,04,91,784 లు చెల్లింపులు జరిగాయని ఏపీడీ తెలియజేశారు.అదే విధంగా పంచాయతీ రాజ్ విభాగంలో 29 పనుల్లో కూలీలకు రూ.8100 లు,మేటీరియల్ కు రూ.2,37,72,612 లు మొత్తం రూ.2,37,80,712 లు చెల్లింపులు జరిగాయని చెప్పారు.ఈ ప్రజా వేదికలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి,ఏపీడీ శివాజీ, అడిషనల్ జిల్లా విజిలెన్స్ అధికారి వి.ప్రభాకర్,ఎస్ఆర్పీలు రవి,జీవన్, ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, ఇంచార్జి ఏపీఓ వి.ప్రభాకర్ రావు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శశాంక్ గణేశ్, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయపోల్‌లో ముగియని ఎన్నికల కోడ్..?

నవతెలంగాణ-రాయపోల్



దేశవ్యాప్తంగా జూన్ 6తోనే ఎన్నికల కోడ్ ముగిసిందని కేంద్ర ఎన్నికల కమిషన్ స్వయంగా ప్రకటించినప్పటికీ రాయపోల్ మండల కేంద్రంలో మాత్రం ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎన్నికల కోడ్ ముగిసిన విగ్రహాలకు, శిలాఫలకాలకు ముసుగు తొలగించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికారులు నిద్రమత్తులో ఉన్నారా? లేక ఎన్నికల కోడ్ ముగిసిపోలేదా అనే భ్రమలో ఉన్నారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మరో విచిత్రం ఏంటంటే భారతదేశంలో రాజకీయ నాయకులు, వివిధ పార్టీ నాయకులు, ప్రభుత్వ శిలాఫలకాలు,రాజకీయ పార్టీల జెండాలు, జండా గద్దెలు వీటన్నింటికీ ఎన్నికల కోడ్ గ్రామాల్లోకి రాగానే తెల్ల రంగు వేయడం లేదా ముసుగు వేయడం చేస్తారు. ఎందుకంటే వాటి ద్వారా వివిధ రాజకీయ పార్టీల గుర్తులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేసే విధంగా కనిపిస్తాయని ఉద్దేశంతో అలా ముసుగు వేస్తుంటారు. కానీ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కానీ జెండాలు కానీ గద్దెలకు కానీ ముసుగు వేయడం, కలర్ వేయడం ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదు. అలా చేసిన దాఖలాలు కూడా లేవు. రాయపోల్ మండల కేంద్రంలో మాత్రం గత రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో అంబేద్కర్ విగ్రహం శిలాఫలకానికి ముసుగు వేయడం అలాగే అంబేద్కర్ జయంతికి సుందరంగా ముస్తాబు చేయడానికి యువజన సంఘాలు కట్టిన నీలిరంగు తోరణాలు కూడా ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తాయని అధికారులు తొలగించడం విడ్డూరంగా ఉంది. ఎక్కడ కూడా నేటి వరకు అంబేద్కర్ జయంతి సందర్భంగా ముస్తాబు చేసిన తోరణాలు కానీ జెండాలు కానీ తొలగించలేదు. అంబేద్కర్ విగ్రహానికి కానీ శిలాఫలకానికి కానీ ముసుగు వేయలేదు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుడిని ఏ రాజకీయ పార్టీకి అనుసంధానంగా ఏ రాజకీయ పార్టీ నేతగా చూడరు. కాబట్టే అంబేద్కర్ విగ్రహానికి ఎన్నికల కోడ్ వర్తించదు. కేవలం అంబేద్కర్ విగ్రహాలు జెండాలు మాత్రమే ఎన్నికల పరిధిలోకి రావు. ఆ సంగతి మరిచి రాయపోల్‌లో అధికారులు అంబేద్కర్ విగ్రహాలకు కూడా ముసుకు వేయడం వింతగా ఉంది. అంటే వేటికి ఎన్నికల కోడ్ వర్తిస్తుందో కూడా తెలియని పరిస్థితిలో అధికారులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల కోడ్ ముగిసి 10 రోజులు గడిచినా విగ్రహాలు, శిలాఫలకాలకు మాత్రం ముసుగు తొలగించడం లేదని ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు.

రూ.25 లక్షలతో దుబ్బాక పట్టణ అభివృద్ధి పనులు

- ధర్మాజిపేటను మున్సిపల్ నుంచి తొలగించాలని కౌన్సిలర్ల వినతి

నవతెలంగాణ-దుబ్బాక



దుబ్బాక పట్టణ అభివృద్ధి పనులకు సాధారణ,పట్టణ ప్రగతి నిధుల ద్వారా రూ.25 లక్షలను ఖర్చు చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి తెలిపారు. మున్సిపల్ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ వనిత భూమిరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో 25 అంశాలకు 22 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. చైర్ పర్సన్ మాట్లాడుతూ..పారిశుధ్య నిర్వహణకు ప్రతి వార్డుకు రూ.1 లక్ష, పలు వార్డుల్లో కల్వర్టులు, మురికి కాలువల మరమ్మతుల కోసం రూ.8 లక్షలు, ఇంటింటికి మొక్కల పంపిణీ కోసం రూ.5 లక్షలు,అంటువ్యాధుల నివారణకు రూ.24 వేలు, మంచినీటి సరఫరా నిర్వహణ కోసం రూ.3 లక్షలు,పశువుల సంతలో సౌకర్యాల కోసం రెండున్నర లక్షలు, చెత్త సేకరణ వాహనాల నిర్వహణ కోసం రూ.1 లక్ష 24వేలు,పలు ఇతర అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ను దుబ్బాక మున్సిపల్ నుంచి తొలగించాలని కోరుతూ 7, 8 ,9 వార్డుల కౌన్సిలర్లు దివిటి కనకయ్య, దుబ్బాక బాలకృష్ణ గౌడ్,బత్తుల స్వామిలు చైర్ పర్సన్,కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. 9 వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి మాట్లాడుతూ ...మున్సిపల్‌లో విలీనం చేసిన నాటి నుంచి తమ గ్రామానికి అన్నిటా అన్యాయమే జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ధర్మాజీపేట ప్రజలపై అధిక పన్నుల భారం పడుతుందని, ఉపాధి హామీ పనులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు.ధర్మాజీపేటను దుబ్బాక మున్సిపాలిటీ నుంచి తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు వలన లాభాలు

- తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. ఎస్. శ్రీదేవి.

నవతెలంగాణ-తొగుట




అధిక సాంద్రత ప్రత్తి సాగు వలన ఎకరానికి 25000 మొక్కలు పెరగడం వలన అధిక దిగిబడులు సాధించవచ్చని తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. ఎస్. శ్రీదేవి తెలిపారు. శనివారం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం, తోర్నాల ఆధ్వర్యంలో యాంత్రిక పద్ధతిలో అధిక సాంద్రత ప్రత్తి నాటడంపై (హెచ్డిపిఎస్ ఇన్ కాటన్) బండారుపల్లి గ్రామంలో క్షేత్ర ప్రదర్శన నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ యాంత్రిక పద్ధతిలో అధిక సాంద్రత ప్రత్తి సాగు కోసం, ఒక వరుసలో మొక్కల మధ్య దూరం 20 సెం.మీ. వరుసల మధ్య దూరం 90 సెం.మీ. నేల స్వభావాన్ని బట్టి విత్తడం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, సుమారుగా ఒక ఎకరం వేయడానికి 4-6 కూలీలు అవసరం అవుతుంది, ఈ యాంత్రిక పద్ధతిలో నాటిన అధిక సాంద్రత ప్రత్తి నాటడం వలన అర గంటలో వేయవచ్చని వివరిం చారు. రోజుకు 9-10 ఎకరాల వరకు విత్తుకోవచ్చ ని సూచించారు. అధిక సాంద్రత ప్రత్తి సాగు వలన ఎకరానికి 25000 మొక్కలు పెరగడం వలన అధిక దిగిబడులు సాధించవచ్చని వివరించారు. ఈ పద్ధ తిలో నాటడం వలన ప్రత్తిని 4 నుంచి 5 సార్లు తీయడం కాకుండా ఒకే సారి ప్రత్తిని తీయవచ్చని అన్నారు. ఈ పద్ధతి లో మెపిక్వాట్ క్లోరైడ్ అనే మందును 50 నుండి 75 రోజులకు 1 మి. లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం వలన మొక్కలు అధికంగా పెరగకుండా నిలువరిస్తుందని తెలిపారు. తదుపరి పంటలలో నీటి సంరక్షణ పద్ధతులు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. విజయ్, డా. సి.హెచ్.పల్లవి క్షుప్తంగా వివరించారు. ఈ కార్య క్రమంలో సిద్దిపేట జిల్లాలో ప్రత్తి సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు. ఈ పద్ధతిని గత రెండు సంవత్సాలుగా వ్యవసాయ పరిశోధనా స్థానం, ఏరువాక కేంద్రం వారిచే సిద్దిపేట జిల్లా రైతుల పొల ల్లో పీనేఉమాటిక్ ప్లంటర్ తో వేయించి నప్పుడు 10 నుండి 12 క్వింటన్ల దిగుబడి రావడంతో పాటు గులాబి రంగు పురుగు ఉధృతి తక్కువగా ఉంటుం దన్నారు. పత్తి తర్వాత పొద్దుతిరుగుడు, మొక్క జొన్న పంటలు సాగు చేయుటం కోసం అను కూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

వాసవి క్లబ్స్ సేవలు అభినందనీయం

- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు దర్శి శ్రీనివాస్ గుప్తా

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట వాసవి క్లబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు దర్శి శ్రీనివాస్ గుప్తా అన్నారు. డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలో వివిధ సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. శ్రీ వేణుగోపాల స్వామి, అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వాటర్ ట్యాంకుల వితరణ, 15 మందికి వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ, 60 మంది స్కూలు విద్యార్థులకు స్టేషనరీ, నోట్ బుక్స్, పంపిణీ, పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, టవల్స్ వితరణ, నేత్రదానం చేయుటకు పదిమంది చేత ఒప్పంద పత్రం, వైశ్య భవన్‌లో గో సేవ, వివిధ దేవాలయాలలో ఆరు వాటర్ ట్యాంకులు అందజేశారు. అభయ జ్యోతి మానసిక వికలాంగుల విద్యాలయంలో ఐరన్ రాక్స్ వితరణ, పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో బీరువా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట వాసవి క్లబ్, వనిత క్లబ్, యూత్ క్లబ్ వారు చాలా మంచి సేవ కార్యక్రమాలు చేస్తూ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌లో ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారన్నారు. అనాధ అమ్మాయి వివాహము, కుట్టుమిషన్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు, నిరుపేదలకు కిరాణము, దుస్తుల పంపిణీ, బియ్యం పంపిణీ, పెన్షన్ పంపిణీ లాంటి ఎన్నో కార్యక్రమాలు చాలా బాగా చేస్తున్నందుకు ముగ్గురి అధ్యక్షులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ నాయకులు గంప శ్రీనివాస్, గెస్ట్ అఫ్ ఆనర్గా గంప కృష్ణమూర్తి, మూడు క్లబ్బుల అధ్యక్షులు చాకిలం రవి, అర్వపల్లి హరి కిరణ్, మరియాల వాణి, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పుల్లూరి శివకుమార్, రీజియన్ చైర్మన్ మాంకాల శ్రీనివాస్, రీజియన్ సెక్రటరీ మంచాల అభినయ్, జోన్ చైర్మన్లు చింత రాజేంద్రప్రసాద్, తోడుపునూరి కృష్ణవేణి, క్లబ్ నాయకులు పుల్లూరి శ్రీనివాస్, జైన సత్యం, తడకమాడ్ల శంకరయ్య, తోట విశ్వం, ఇల్లెందుల నాగేందర్, తోటమని, శివ సంతోష్ పాల్గొన్నారు.

అమరేందర్ రెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం, రామవరం గ్రామంలో క్రీ.శే లు ఎడమల అమరెందర్ రెడ్డి 11వ వర్ధంతిని ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామవరం గ్రామానికి అమరేందర్ రెడ్డి ఎన్నో సేవలు చేశారని గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాంన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు ఎడబోయిన మధుసుధన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగాల సాయన్న, బిఆర్ ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు సాధు ప్రతాప్ రెడ్డి, నాయకులు బోనగిరి అంజయ్య, రచ్చ సత్య నారాయణ, బుర్ర సత్తయ్య, పొన్న గంగాధర్, కరుణాకర్, గన్నరెడ్డి, మహేష్ రెడ్డి, సంపత్,లింగాల నర్సింహులు, పొన్న ప్రవీణ్, లింగాల పర్శరాములు, ఎల్లయ్య, సంతోష్, రాజిరెడ్డి, రామలింగం, దేవదాస్, పడిగలాశ్రీనివాస్ రెడ్డి, చిన్న మల్లయ్య, రాజయ్య, రామయ్య, వెంకటయ్య, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

- అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరికి వినతి పత్రం

నవతెలంగాణ-నంగునూరు: నంగునూరు మండలం అక్కెనపల్లి మోడల్ స్కూల్ కు ప్రత్యేక బస్సులు వేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి తెలియజేశారు. శనివారం సిద్దిపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన నంగు నూరులో విలేకరులతో మాట్లాడుతూ గతంలో నం గునూరు మండలానికి నడిచిన బస్సులను పునరుద్ధ రణ చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం లేకపోవడంతో అడ్మిషన్‌లు జరగడం లేదని వాపోయారు. ఒకప్పుడు ఐదు వందల మంది విద్యార్థులు ఉంటే నేడు వందల్లో ఉన్నారని చెప్పారు.



ఆర్టీసీ కల్పిస్తున్నా బస్సు సౌకర్యం ఏ మూలకు సరిపోవడం లేదని వాపోయారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మండలం లోని అన్ని గ్రామాలను తిరిగే విధంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రత్యేకంగా మోడల్ స్కూల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

కులమతాల పేరు చెప్పి ఓట్లను బిచ్చమెత్తుకున్న మోడీ

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్



దేశంలో మోడీ మార్క్ ఎక్కడుందో చెప్పాలని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలు జిల్లాలు పల్లెలు పట్నాలు తిరిగి ఓట్లు బిచ్చం ఎత్తుకొన్న మోడీ ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని ఆయన అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కార్ అబద్ధపు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అన్ని రంగాలను ప్రైవేటు చేస్తూ ప్రధాని మోడీ ఆదానే అంబానీ గ్రూపులకు దేశాన్ని తాకట్టు పెట్టే పరిస్థితికి వచ్చిందన్నారు. కొందరు బిజెపి నాయకులకు గజ్వేల్‌లో కేసీఆర్ పై విమర్శలు చేస్తున్నారని గజ్వేల్ అభివృద్ధి ఎంత జరిగిందో బీజేపీ నాయకులు తెలుసు కోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రిపై అనుచిత వాక్యాలు చేయడం సిగ్గుచేటన్నారు. కెసిఆర్ మార్కు గజ్వేల్‌లో కనిపిస్తుందని మోడీ మార్కు దేశంలో ఎక్కడ ఉందో చెప్పాలన్నారు. దేశాన్ని నరేంద్ర మోడీ, రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి దివాలా తీయిస్తున్నారన్నారు.

పుస్తకాలు స్కూల్ డ్రెస్‌ల పంపిణీ

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ గ్రామ ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు శ్రద్ధతో చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, స్లివా, ఇందిర, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.